నేటి నిజం నేటినిజం నేటినిజం నేటినిజం

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com


**నేటి కందం-నేటికి అందం**

కూడళ్ళ లోన ప్రజలకు
కూడగ సదుపాయతతులు కోరిన వెంటన్
మోడీ ప్రారంభించెను
మూడు మహా స్టేషనులను ముదమొప్పంగన్ !!

(ప్రజలకు మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు మంగళగిరి,రాయనపాడు,కంబం రైల్వే స్టేషన్లను ఆధునీకరించి మోడీ వాటికి ప్రారంభోత్సవం చేశారు)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

దగాకోరు రాజకీయ
ధరణి అక్రమాల చిట్ట
విమర్శల విసురుకాక
విప్పగలరా బొందపెట్ట.
భూభారతి తెచ్చినా
భూ చిక్కులు అదేజోరు
తాబేలులా సర్కారు
తయారైతే ఏడ తీరు.



-వేల్పుల నారాయణ
9440433475


హైదరాబాద్ ఆదివారం 19-7-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:270 పేజీలు:6 వెల: రూ.1/-


# వైద్య సేవలపై మంత్రి దామోదర్ దిశానిర్దేశం

**-హాజరైన సూపరింటెండెంట్లు**
**-100 పడకలకు పైగా ఉన్న ఆసుపత్రులపై ప్రత్యేక దృష్టి**
**-రాష్ట్రంలోని ప్రధాన ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, వైద్య సేవల నాణ్యత పెంపుపై సమీక్ష**
**-ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అధికారులతో మంత్రి చర్చ**
**-హైదరాబాద్‌లో ప్రభుత్వ ఆసుపత్రులపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష**

హైదరాబాద్, జులై 18:రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు, వైద్య సేవల నాణ్యత మెరుగుదలపై సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లోని వెంగళరావు నగర్‌లో ఉన్న ఫ్యామిలీ వెల్ఫేర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈ సమావేశం జరిగింది. డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని 47 ఆసుపత్రులు, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ పరిధిలోని 40 ఏరియా ఆసుపత్రుల్లో 100 పడకలు, అంతకంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న ఆసుపత్రుల సూపరింటెండెంట్లు ఈ సమావేశానికి హాజరయ్యారు.

ఆసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలు, మౌలిక వసతుల అభివృద్ధి, పరిపాలన అంశాలపై మంత్రి అధికారులతో చర్చించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా ఆసుపత్రుల పనితీరును మరింత మెరుగుపర్చాలని సూచించారు.

ఈ సమీక్ష సమావేశంలో ఎఐజిఈ గవర్నింగ్ కౌన్సిల్ చైర్‌పర్సన్ డా. కవితా రెడ్డి, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్. చోంగ్తు, తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ డా. గౌరవ్ ఉప్పల్, రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో హనుమంతు, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డా. నరేంద్ర కుమార్, డైరెక్టర్ పబ్లిక్ హెల్త్ డా. రవీందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణానికి పకడ్బంది ఏర్పాట్లు చేయాలి : మాజీ మంత్రి తలసాని




హైదరాబాద్ : ఈ నెల 21న నిర్వహించనున్న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం, 22న జరగనున్న రథోత్సవం సందర్భంగా అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బంది ఏర్పాట్లు చేయాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు.

శనివారం బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఏర్పాట్లపై చర్చించారు. ఈ వేడుకలకు మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు తరలివస్తారని వెల్లడించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను చేపట్టాలని సూచించారు. ప్రజలు సంతోషంగా జరుపుకునే వేడుకకు ఆంక్షలు పెట్టి ఇబ్బందులు పెట్టొద్దని అధికారులకు స్పష్టం చేశారు.

ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక అదనపు పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలని, నిరంతర పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. భక్తులు తోపులాటకు గురికాకుండా పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రథోత్సవం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆలయ పరిసరాలలో ప్రత్యేక హెల్త్ క్యాంప్ లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బల్కంపేట ఎల్లమ్మ ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ ఈవో వినోద్ రెడ్డి, డీసీ సుజాత, వాటర్ వర్క్స్ జీఎం సతీష్, ఎలక్ట్రికల్ డీఈకిషోర్, ఆర్ అండ్ బి డీఈ మనోహర్, లా అండ్ ఆర్డర్ సీఐ శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ తీరుతో ప్రజలు విసిగిపోయారు: ఎంపీ లక్ష్మణ్

హైదరాబాద్, జులై 18: తెలంగాణలో అధికారంలోకి రావాలనే పట్టుదలతో ఉన్న బీజేపీ.. ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే నేతల మధ్య విభేదాలను తొలగించి.. అందరినీ ఒక తాటిపైకి తీసుకురావాలని ప్లాన్ చేస్తోంది. ఎంతో కాలంగా విభేదాలతో ఎడమొహం పెడమొహంగా ఉంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్య కుదిర్చారు.

వీరిద్దరి మధ్య రాజీ కుదిర్చేందుకు రంగంలోకి దిగిన బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్.. నేడు ఈటల రాజేందర్, బండి సంజయ్‌తో సమావేశం నిర్వహించారు. ఎంపీ లక్ష్మణ్ నివాసం వేదికగా జరిగిన ఈ సమావేశంలో ఈటల, బండి మధ్య రాజీ కుదిర్చారు. విభేదాలు పక్కనపెట్టి.. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చే దిశగా కృషి చేయాలని ఇద్దరు నేతలకు అభయ్ పాటిల్ దిశానిర్దేశం చేశారు.

భేటీ అనంతరం మీడియా ముందుకు బీజేపీ నేతలు.. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే అని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ తీరుతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని, కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందంటూ ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధిపై మోదీ ప్రత్యేక చొరవ చూపారని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే అధికారమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.






**భారత అంతరిక్ష చరిత్రలో కొత్త అధ్యాయం..**

# 'విక్రమ్-1' ప్రయోగం విజయవంతం





న్యూ ఢిల్లీ, జులై 18:భారత అంతరిక్ష రంగంలో మరో చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో హైదరాబాద్‌కు చెందిన ప్రైవేట్ అంతరిక్ష సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన విక్రమ్-1 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించిన రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లి తన లక్ష్యాన్ని చేరుకుంది.

'మిషన్ ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ ప్రయోగంలో విక్రమ్-1 రాకెట్ తన పేలోడ్లను విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. దీంతో భారత ప్రైవేట్ అంతరిక్ష రంగం మరో కీలక మైలురాయిని అధిగమించింది. విక్రమ్-1 విజయవంతంగా ప్రయోగం పూర్తవడంతో స్కైరూట్ లాంచ్ కంట్రోల్ సెంటర్‌లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. స్కైరూట్ శాస్త్రవేత్తలతో పాటు ఇస్రో అధికారులు, శాస్త్రవేత్తలు ఈ విజయాన్ని సంబరంగా జరుపుకున్నారు.

ఇస్రో వేదికగా ప్రైవేట్ రంగం అభివృద్ధి చేసిన రాకెట్ విజయవంతంగా ప్రయోగం కావడం భారత అంతరిక్ష రంగానికి చారిత్రక ఘట్టంగా నిలిచింది. ఈ విజయంతో దేశంలో ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమకు మరింత ఊతం లభించనుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### స్కైరూట్‌కు ప్రధాని అభినందనలు

భారత అంతరిక్ష రంగంలో చరిత్ర సృష్టించిన విక్రమ్-1 రాకెట్ విజయవంతమైన ప్రయోగంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో వేదికగా తొలిసారిగా ప్రైవేట్ సంస్థ రూపొందించిన రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లడాన్ని అభినందించారు. విక్రమ్-1 విజయానంతరం ప్రధాని మోదీ స్కైరూట్ ఏరోస్పేస్ శాస్త్రవేత్తలతో ఫోన్‌లో మాట్లాడి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ విజయం భారత అంతరిక్ష రంగానికి కొత్త శకానికి నాంది పలికిందని, దేశ యువతకు ఇది స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రైవేట్ రంగం సాంకేతిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన స్కైరూట్ బృందాన్ని త్వరలోనే స్వయంగా కలుసుకుంటానని ప్రధాని మోదీ తెలిపారు. భారత అంతరిక్ష రంగంలో ఇలాంటి వినూత్న ఆవిష్కరణలు మరింత వేగంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. విక్రమ్-1 విజయంతో భారత అంతరిక్ష పరిశ్రమలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం మరింత బలోపేతం కానుందని, ప్రపంచ వాణిజ్య అంతరిక్ష మార్కెట్లో భారత స్థానం మరింత బలపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఎస్సీ, ఎస్టీ పథకాల అమలులో ప్రత్యేక దృష్టి సారించాలి

**-గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ పాఠశాలల్లో ఒక్క సీటు కూడా ఖాళీ ఉండొద్దు**



కరీంనగర్, జులై 18: (నేటినిజం ప్రతినిధి) ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు.

శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీపీ రాంరెడ్డి, అదనపు కలెక్టర్లు బి. శ్రీరాములు, జె. అరుణశ్రీతో కలిసి జిల్లా అధికారులతో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల పురోగతిని వివరించారు.

గురుకులాలు, సంక్షేమ, గిరిజన రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు (కేజీబీవీలు), మోడల్ పాఠశాలల నిర్వహణ, మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలపై కమిషన్ చైర్మన్ సమీక్షించారు.

ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో మాట్లాడి ఎస్సీ, ఎస్టీ బాధితుల పరిహారానికి సంబంధించిన 50 శాతం నిధులను విడుదల చేయించినట్లు తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, ఓవర్సీస్ విద్యా పథకం, ఎస్సీ, ఎస్టీ బాధితుల పరిహారం, గురుకుల విద్యాసంస్థలకు సంబంధించిన పెండింగ్ నిధుల వివరాలను వెంటనే కమిషన్‌కు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

ఈ నెలాఖరులో ముఖ్యమంత్రితో సమావేశం నిర్వహించనున్నందున పెండింగ్ నిధుల విడుదల అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి మిగిలిన నిధులను కూడా విడుదల చేయించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. జిల్లాలోని గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ పాఠశాలల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా లేకుండా పూర్తి విద్యార్థి సామర్థ్యంతో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల భర్తీలో ఎస్సీ, ఎస్టీలకు అమలులో ఉన్న రిజర్వేషన్లను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఉపాధి కల్పన కార్యాలయం, వారధి సొసైటీ ద్వారా భర్తీ చేసే ఉద్యోగాల్లో కూడా రిజర్వేషన్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.

## ఏడుపాయల వనదుర్గమ్మకు మంచు విష్ణు పూజలు



సంగారెడ్డి, జులై 18: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణలోని ప్రముఖ దేవస్థానమైన వనదుర్గ భవానీ మాతను సినీ హీరో మంచు విష్ణు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన ఏడుపాయల చేరుకోగానే మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్ సాదర స్వాగతం పలికారు.

మెదక్ జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా జిల్లా యంత్రాంగం ఆహ్వానం మేరకు పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు మంచు విష్ణు శనివారం వచ్చారు. ముందుగా పాపన్నపేట మండల పరిధిలోని ఏడుపాయల వనదుర్గ భవానీ ఆలయాన్ని ఆయన సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ చరిత్ర, ఆలయ ప్రశస్తిని జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్ విష్ణుకు వివరించారు.

# దేశ అంతరిక్ష కలలకు చిరునామాగా తెలంగాణ: సీఎం రేవంత్ రెడ్డి



హైదాబాద్, జులై 18: భారత్ తొలి ప్రైవేట్ అంతరిక్ష ప్రయోగం 'విక్రమ్-1' విజయవంతంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. 'హైదరాబాద్ రైజింగ్.. తెలంగాణ రైజింగ్' అంటూ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. భారత్ తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-1' విజయవంతమైన ప్రయోగమన్నారు. శ్రీహరికోట నుంచి విక్రమ్-1 నింగిలోకి దూసుకెళ్లిందని, హైదరాబాద్ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ ఘన విజయం సాధించిందని తెలిపారు. భారత అంతరిక్ష రంగం మరో చారిత్రక మైలురాయిని చేరుకుందన్నారు.

దేశ అంతరిక్ష కలలకు చిరునామాగా తెలంగాణ నిలిచిందని సీఎం అన్నారు. హైదరాబాద్ ఇన్నోవేషన్ శక్తికి ప్రపంచ వేదికపై గుర్తింపు లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా స్కైరూట్ బృందానికి ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు. విక్రమ్-1.. ప్రైవేట్ స్పేస్ రంగంలో భారత్ సత్తా చాటిందని కొనియాడారు. భవిష్యత్తు అంతరిక్ష ప్రయాణాలకు తెలంగాణ నుంచి బలమైన అడుగు పడిందని ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు.

## భారత్ మరిన్ని విజయాలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి: సీఎం చంద్రబాబు

అమరావతి, జులై 18: 'విక్రమ్-1' రాకెట్ తొలి ప్రయోగంలోనే విజయం సాధించడంపై సీఎం చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. స్కైరూట్ ఏరోస్పేస్, ఇస్రో, ఇన్-స్పేస్, ఎన్ఎస్ఐఎల్‌లకు ఎక్స్ వేదికగా అభినందనలు తెలియజేశారు. విక్రమ్-1 తొలి ప్రయోగంలోనే విజయవంతంగా కక్ష్యలోకి చేరడంతో భారత్ మరో చారిత్రక మైలురాయిని అధిగమించిందన్నారు. ప్రపంచంలోని అత్యుత్తమ దేశాలతో పోటీపడే స్థాయికి భారత ప్రైవేటు అంతరిక్ష రంగం ఎదిగిందని ఈ విజయం నిరూపించిందని వెల్లడించారు. ఇది భారత అంతరిక్ష రంగంలో ఒక నూతన యుగానికి నాంది అని పేర్కొన్నారు.

శాస్త్రీయ సంస్థల సామర్థ్యం, భారతీయ పారిశ్రామికవేత్తల సృజనాత్మకత కలిసినప్పుడు ఆవిష్కరణలకు కొత్త హద్దులు ఏర్పడతాయని ఈ ఘన విజయం చాటిచెప్పిందని సీఎం తెలిపారు. స్కైరూట్ ఏరోస్పేస్, ఇస్రో, ఇన్-స్పేస్, ఎన్ఎస్ఐఎల్ సహా ఈ విజయాన్ని సాకారం చేసిన వేలాదిమంది శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు, భాగస్వామ్యులందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ విజయం ప్రతి భారతీయుడు గర్వపడే క్షణమన్నారు. భావితరాల యువ శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలకు గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. నక్షత్రాల వైపుగా భారత్ సాగిస్తున్న ప్రస్థానం మరిన్ని విజయాలతో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

## నల్లగొండ జిల్లాలో ప్రేమజంట ఆత్మహత్య

నల్గొండ, జులై 18: జిల్లాలోని కట్టంగూర్ మండలంలో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ప్రేమికులు బలవన్మరణానికి పాల్పడ్డారు. మండలంలోని మునుకుంట్లలో నివాసముంటున్న సూర్యాపేటలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతున్న ప్రసన్న కు చరణ్ అనే యువకుడితో పరిచయం ఏర్పడి ఇద్దరు ప్రేమించుకుంటు న్నారు.

అయితే ప్రసన్న ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. చరణ్ కారణంగా తమ కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని ప్రసన్న కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో ఆ అవమానాన్ని భరించలేక చరణ్ తాటి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే వీరి ఆత్మహత్యకు కారణాలు ఇంకా తెలియరాలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

# ఫుట్‌బాల్ క్రీడతో యువతలో శారీరక మానసిక వికాసం

## (జూలై 19న "జాతీయ ఫుట్‌బాల్ దినోత్సవం" సందర్భంగా)

2026 ఫిఫా ప్రపంచ కప్ ప్రపంచవ్యాప్త క్రీడాభిమానులను ఉర్రూతలూగిస్తున్నది. ఫైనల్ మ్యాచ్ జూలై 19, 2026న అమెరికాలోని న్యూజెర్సీలో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా, యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్ మధ్య జరగనుంది. ఫుట్‌బాల్ సంచలనం మెస్సీ అభిమానులు ఆనందంతో ఉప్పొంగిపోతున్నారు. నిన్నటి "క్రిస్టియన్ రొనాల్డో", నేటి "లియోనెల్ మెస్సీ" ఫుట్‌బాల్ చరిత్రలో అత్యంత ఘనత సాధించిన ఇద్దరు ఆటగాళ్ళు. రొనాల్డో 970కి పైగా అధికారిక గోల్స్ చేసి అగ్రస్థానంలో ఉండగా, మెస్సీ ఇప్పటివరకు 919 గోల్స్ సాధించి కొనసాగుతున్నాడు. ఈ ఇద్దరు ఫుట్‌బాల్ ఆటగాళ్లను ఫుట్‌బాల్ అభిమానులు దేవుళ్ళుగా భావిస్తారు. లియోనెల్ మెస్సీని ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులు ఎంతో ఆప్యాయంగా "లా పుల్గా (ది ఫ్లీ)", "లా పుల్గా అటోమికా (ది అటామిక్ ఫ్లీ)", "ది ఊాయి (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్స్)" అని పిలుస్తారు. మెస్సీకి ఉన్న కోట్ల అభిమానులు, క్లబ్‌లు, జట్లు, ప్రేమికులు ఇప్పటి వరకు 700కి పైగా ముద్దు పేర్లు పెట్టారు.

### జాతీయ ఫుట్‌బాల్ దినోత్సవం:

అమెరికా వ్యాప్తంగా క్రీడా, సాంస్కృతిక జీవితంలో అమెరికన్ ఫుట్‌బాల్ పోషిస్తున్న అపారమైన పాత్రను వేడుకగా జరుపుకోవడానికి, "జాతీయ ఫుట్‌బాల్ దినోత్సవం" 2026 జూలై 19, ఆదివారం నాడు జరుగుతుంది. ఈ రోజును వివిధ దేశాల క్రీడాభిమానులు, క్రీడా సంఘాలు అనధికారికంగా నిర్వహిస్తాయి. ఇది అమెరికన్ శరదృతువు వారాంతాల క్రీడగా పేరొందింది. ఫుట్‌బాల్ ఆటగాళ్లు, మద్దతుదారుల మధ్య పెంపొందించే సామూహిక భావనకు నివాళి అర్పించడం జరుగుతోంది. జాతీయ ఫుట్‌బాల్ దినోత్సవానికి ప్రాముఖ్యత పెరగడానికి కారణంగా ఉమ్మడి సంస్కృతిని, గెమ్ చుట్టూ ఏర్పడిన స్నేహాన్ని, ఈ క్రీడ యువ ఆటగాళ్లకు నేర్పే క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని చాటడమని తెలుసుకోవాలి.

### ఫుట్‌బాల్ క్రీడ యొక్క మూలం :

స్థానిక ఫుట్‌బాల్ మ్యాచ్‌లను నిర్వహించడం, ఆట యొక్క అందాన్ని ప్రతిబింబించే కంటెంట్‌ను సృష్టించడం, ఆటగాళ్లకు, మద్దతుదారులకు పార్టీ ఇవ్వడం వంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా జాతీయ ఫుట్‌బాల్ దినోత్సవాన్ని పాటించవచ్చు. "అమెరికన్ ఫుట్‌బాల్ పితామహుడు" అని పిలువబడే "వాల్టర్ క్యాంప్" (1859 – 1925), యేల్ విశ్వవిద్యాలయ అథ్లెటే కాకుండా కోచ్ కూడా. ఈ ఆట యొక్క అనేక ప్రాథమిక నియమాలకు ఈయన మార్గదర్శకత్వం వహించారు. 1800లలో, రగ్బీ, సాకర్ రెండూ ఆటలు అమెరికన్ ఫుట్‌బాల్‌కు మార్గం సుగమం చేశాయి, కానీ దీనిని 'గ్రిడైరన్' లేదా 'అమెరికన్ ఫుట్‌బాల్' అని కూడా పిలుస్తున్నారు.

### భారతదేశంలో ఫుట్‌బాల్ క్రీడ:

"ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్" ఆధ్వర్యంలో, భారతదేశంలో ఈ క్రీడ స్థానిక స్థాయి నుండి అంతర్జాతీయ ర్యాంకింగ్‌ల వరకు, క్షేత్రస్థాయి భాగస్వామ్యం మరియు యువత అభివృద్ధిలో గణనీయమైన పెరుగుదలను చూస్తోంది. 2024 సర్వే ప్రకారం, భారతదేశ జనాభాలో 21 శాతం మంది, అంటే 30.5 కోట్ల మంది భారతీయులు ఫుట్‌బాల్ అభిమానులుగా ఉన్నారు. అస్సాం, గోవా, కర్ణాటక, తమిళనాడు, కేరళ, మణిపూర్, మేఘాలయ, నాగాలాండ్ మరియు పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో ఇది ఒక ప్రధాన క్రీడ.

క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంచుతూ, మానసిక వికాసానికి దోహదపడతాయి. మైదాన క్రీడలు ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలి. శారీరక దృఢత్వం ఉన్న దేహంలో చురుకైన మెదడు ఉంటుందని తెలుసుకుందాం. ఫుట్‌భాల్ లాంటి క్రీడలతో శారీరక దృఢత్వం పెరగడం, జట్టు స్ఫూర్తి అలవడడం, క్రీడా స్ఫూర్తి మరింత బలోపేతం కావడం, జాతీయ భావన పెరగడం, పేరు ప్రఖ్యాతులు పొందడం, ఆర్థిక ఉద్యోగాల్లో రాణించడం లాంటి ప్రయోజనాలు ఉంటాయని గమనించి నేటి యువత వీడియో గేమ్స్ కాకుండా అవుట్‌డోర్ గేమ్స్ పట్ల మక్కువ పెంచుకోవాలి. రేపటి తరానికి ఆరోగ్యకరమైన జీవనశైలిని అందించాలి.



-మధుపాళీ
9949700037

# హర్యానాలోని జింద్‌లో అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలకు సంబంధించిన విశేషాలను పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జులై 18:హర్యానాలోని జింద్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు సంబంధించిన దృశ్యాలను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీపంచుకున్నారు. ఈ చారిత్రక ప్రదేశానికి రావడం పట్ల ఆయన ఎనలేని ఆనందాన్ని వ్యక్తం చేశారు. జింద్ ప్రాంతానికి ఉన్న సుసంపన్నమైన చారిత్రక ప్రాధాన్యతను, యుద్ధ వీరుల పరాక్రమ వారసత్వాన్ని, ఆధ్యాత్మిక వైభవాన్ని కొనియాడారు. శక్తిపీఠమైన శ్రీ జయంతి దేవి అమ్మవారి దివ్య ఆశీస్సులు ఈ నేలకు లభించడం ఇక్కడి ప్రజల ప్రత్యేక అదృష్టమని అన్నారు.

హర్యానా పర్యటనలో భాగంగా జింద్-సోనిపట్ మధ్య నడవనున్న దేశపు మొట్టమొదటి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన హైడ్రోజన్ ఇంధన రైలును జెండా ఊపి ప్రారంభించారు.

ఈ అసాధారణమైన విజయం భారతీయ రైల్వే బృందం అంకితభావానికి, అపారమైన నైపుణ్యానికి నిదర్శనం. ఆత్మనిర్భర్ భారత్ సంకల్పానికి, భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా పర్యావరణహిత రవాణా వ్యవస్థను నిర్మించాలనే తమ నిబద్ధతకు ఈ హైడ్రోజన్ రైలు ఒక గర్వకారణం

హర్యానాలోని జింద్‌లో దేశ చరిత్రలోనే మొట్టమొదటి హైడ్రోజన్ రైలును ప్రారంభించడం నాకు గర్వంగా ఉంది. స్వచ్ఛమైన, పచ్చని, స్వయం సమృద్ధ ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణంలో ఇది ఒక అద్భుతమైన విజయం. అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిన ఈ రైలు దేశ సాంకేతిక సామర్థ్యానికి నిదర్శనంగా నిలవడమే కాకుండా యావత్ ప్రపంచానికి ఒక గొప్ప ఆదర్శం గా మారుతుంది.జింద్ అభివృద్ధి కార్యక్రమంలో మా హర్యానా కుటుంబ సభ్యులు చూపిన ఉత్సాహం మాలో నూతన శక్తిని నింపింది.

జింద్-సోనివట్ మధ్య పరుగు తీసే ఈ తొలి హైడ్రోజన్ రైలు 21వ శతాబ్దపు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో భారత్ వేసిన అతి పెద్ద ముందడుగు. ఈ రైలు అసాధారణ సామర్థ్యం గురించి తెలిస్తే ప్రతి భారతీయుడి గుండె గర్వంతో ఉప్పొంగుతుంది.

2014 సంవత్సరానికి పూర్వపు పరిస్థితులే గనుక ప్రస్తుతం ఉండి ఉంటే.. ప్రపంచ చమురు సంక్షోభం కారణంగా భారతదేశ రైల్వే వ్యవస్థ పూర్తిగా స్థంభించిపోయేది. అయితే మా ప్రభుత్వం సమస్యలను ముందే ఊహించి వాటికి తగిన శాశ్వత పరిష్కారాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తోంది. ఈ ముందు చూపుతో కూడిన విధానాల ఫలితాలను నేడు దేశవ్యాప్తంగా ప్రజలు కళ్లారా చూస్తున్నారు.

హర్యానాలోని డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఇక్కడి క్రీడాకారులకు అన్ని రకాల అత్యాధునిక సౌకర్యాలను కల్పిస్తోంది. రాబోయే ప్రతిష్టాత్మక అంతర్జాతీయ క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దేశ కీర్తి పతాకాన్ని ఎగురవేయాలని రాష్ట్ర యువ క్రీడాకారులకు నా విజ్ఞప్తి.

# డామన్‌లోని నమో విమానాశ్రయం నుంచి తొలి విమాన సర్వీసును ప్రారంభించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

న్యూఢిల్లీ, జులై 18:దాద్రా నగర్ హవేలీ, డామన్, దయ్యూ కేంద్రపాలిత ప్రాంత చరిత్రలో కీలకంగా నిలిచేలా నమో విమానాశ్రయం నుంచి డామన్-ఢిల్లీ- డామన్ మార్గంలో జులై 16, 2026న తొలి విమాన సర్వీసును కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు కింజరాపు, కేంద్రపాలిత ప్రాంత అడ్మినిస్ట్రేటర్ శ్రీ ప్రఫుల్ పటేల్ కలిసి ప్రారంభించారు. ఈ సర్వీసును ప్రభుత్వ యాజమాన్యంలోని ప్రాంతీయ విమానయాన సంస్థ అలయన్స్ ఎయిర్ ప్రారంభించింది. దీంతో డామన్‌కు తొలిసారిగా నేరుగా విమాన సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తలపెట్టిన డామన్ విమానాశ్రయం.. భారత తీర రక్షక దళ వైమానిక కేంద్రం (ఐసీజీఏఎస్) పరిధిలో నడిచే ఉభయతారక సదుపాయం. ఏప్రిల్ 25, 2023న ప్రధానమంత్రి ఈ విమానాశ్రయ సివిల్ టెర్మినల్‌కు శంకుస్థాపన చేయగా.. జూన్ 5, 2026న ఆయనే దీన్ని ప్రారంభించారు.

ఈ టెర్మినల్‌ను 25 ఎకరాల స్థలంలో రూ.124 కోట్ల వ్యయంతో యూటీ పరిపాలనా విభాగం నిర్మించగా.. రూ.88 కోట్లను పౌర విమానయాన మంత్రిత్వ శాఖ తిరిగి చెల్లించింది. 3,700 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ టెర్మినల్.. రోజుకు 14 ఏటీఆర్ విమానాల రాకపోకలను నిర్వహిస్తుంది. ఏడాదికి 3.67 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యం ఈ టెర్మినల్‌కు ఉంది.

ఈ విమాన సర్వీసు ప్రారంభోత్సవానికి కేంద్రపాలిత ప్రాంత పరిపాలనా విభాగం, భారత విమానయాన ప్రాధికార సంస్థ (ఏఏఐ), అలయన్స్ ఎయిర్, భారత తీర రక్షక దళ ఉన్నతాధికారులతో పాటు డామన్ స్థానికులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా శ్రీ రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. "ఈ చరిత్రాత్మక సందర్భంలో డామన్ ప్రజలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ తొలి విమాన సర్వీసు ద్వారా డామన్ ప్రజలు నేరుగా దేశ రాజధానికి చేరుకోవచ్చు. 8-10 గంటల సమయం వెచ్చించి సూరత్, ముంబయి నుంచి వెళ్లటానికి బదులుగా డామన్ నుంచి నేరుగా 2.5 గంటల్లోనే ఢిల్లీకి వెళ్లవచ్చు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన విప్లవాత్మక పథకం ఉడాన్ ద్వారానే ఇది సాధ్యమైంది" అని అన్నారు.

గడిచిన 12 ఏళ్లలో ప్రధానమంత్రి నాయకత్వంలో దాద్రానగర్ హవేలీ, డామన్ దయ్యూ.. రూ.13,000 కోట్లకు పైగా విలువైన 450కి పైగా ప్రాజెక్టుల ద్వారా ప్రయోజనం పొందాయని మంత్రి అన్నారు. డామన్ ప్రజల చిరకాల కోరికను నెరవేర్చినందుకు, ప్రధానమంత్రి దార్శనికతకు గౌరవ సూచికంగా డామన్ ప్రజలు నూతన విమానాశ్రయానికి నమో ఎయిర్‌పోర్టు అని పేరు పెట్టినట్లు వెల్లడించారు.

డామన్ డయ్యూ, దాద్రానగర్ హవేలీ ప్రాంతంలో 7,000లకు పైగా పరిశ్రమలున్నాయి. దాని పరిసర ప్రాంతాలైన వాపి, వల్సాడ్‌లో మరో 15,000లకు పైగా కర్మాగారాలున్నాయి. విమానయాన సౌకర్యం ద్వారా ఇక్కడి వ్యాపారాలు వృద్ధి చెందుతాయి. పెట్టుబడులు రావటంతో పాటు స్థానిక యువతకు నూతన ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి.

పర్యాటక రంగానికున్న అవకాశాలను ప్రస్తావిస్తూ.. ఏటా దాదాపు 20 లక్షల మంది పర్యాటకులు డామన్‌ని సందర్శిస్తారని, విమానయాన ప్రయాణం అందుబాటులోకి రావటంతో ఈ సంఖ్య వేగంగా పెరుగుతుందని మంత్రి అన్నారు. రన్ వే పొడవును పెంచటం ద్వారా ఎయిర్ బస్ ఏ320 వంటి పెద్ద విమానాలు డామన్‌లో దిగేలా చేయాలని.. ముంబయి, సూరత్, అహ్మదాబాద్, పాట్నా వంటి నగరాలకు అనుసంధానాన్ని పెంచాలని యోచిస్తున్నట్లు తెలిపారు.

దయ్యూ విమానాశ్రయ వార్షిక ప్రయాణికుల సంఖ్య 2013లో కేవలం 19,000 ఉండగా.. నేడు లక్షకు పైగా అయిందని మంత్రి తెలిపారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా దయ్యూ విమానాశ్రయంలో నూతన టెర్మినల్‌ను, అదనంగా మరో రన్ వేను అభివృద్ధి చేసేందుకు మంత్రిత్వ శాఖ కృషి చేస్తోందని చెప్పారు.

కేంద్రమంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు, డామన్ విమానాశ్రయ ప్రాముఖ్యతను వివరిస్తూ.. "డామన్ బ్లూ ఎకానమీని సముద్రయాన రంగంలోని అపరిమిత అవకాశాలతో పీఎం అనుసంధానించారు. డామన్ మత్స్య సంపద, సముద్ర ఉత్పత్తులు, ఆహార ప్రాసెసింగ్ వస్తువులు ఇకపై కొన్ని గంటల్లోనే దేశంలోని ఏ ప్రాంతానికైనా చేరుకోగలుగుతాయి" అని అన్నారు. దీనివల్ల మత్స్యకా రులకు మేలు జరుగుతుందని, సముద్ర ఉత్పత్తులను సాగు చేసే వారికి నూతన మార్కెట్ అవకాశాలు లభిస్తాయని, స్థానిక ఫార్మా రంగం నూతనోత్తేజంతో దూసుకెళ్తుందని పేర్కొన్నారు.

విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఉడాన్ పథకాన్ని మరో 10 ఏళ్ల పాటు పొడిగిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. సవరించిన ఉడాన్ పథకం ద్వారా రాబోయే పదేళ్లలో దేశవ్యాప్తంగా 100 నూతన విమానాశ్రయాలు, 200 నూతన హెలిప్యాడ్లను అభివృద్ధి చేసేందుకు రూ.29,000 కోట్ల నిధులను కేటాయించినట్లు చెప్పారు. దీనిద్వారా భారతదేశ ప్రాంతీయ విమానయాన వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు.

నమో విమానాశ్రయ ప్రాజెక్టును పూర్తి చేయటంలో కీలక పాత్ర పోషించిన భారత తీర రక్షక దళ సిబ్బందికి మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. చరిత్రాత్మకమైన ఈ సందర్భంలో.. డామన్ ప్రజలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ ప్రసంగాన్ని ముగించారు.

దాద్రా నగర్ హవేలీ, డామన్ దయ్యూ అడ్మినిస్ట్రేటర్ శ్రీ ప్రఫుల్ పటేల్ మాట్లాడుతూ.. "గుజరాత్‌లోని వల్సాడ్ నుంచి మహారాష్ట్రలోని పాల్ఘర్ పారిశ్రామిక ప్రాంతానికి నమో విమానాశ్రయం కీలకంగా మారుతుంది. ఇది స్థానిక యువతకు నూతన అవకాశాలను కల్పిస్తుంది. రాబోయే 15 ఏళ్లలో డామన్ నమో విమానాశ్రయం ఎంతో అభివృద్ధి చెంది, ఈ ప్రాంత ఆర్థిక వ్యవస్థ రూపురేఖలనే మార్చేస్తుందని నేను విశ్వసిస్తున్నా" అని అన్నారు.

# ట్రినిటీలో పలు కోర్సుల అనుమతి

కరీంనగర్, జులై 18: పెద్దపల్లి ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో పలు కోర్సులకు కౌన్సెలింగ్ నిర్వహించేందుకు అనుమతి లభించిందని ట్రినిటీ విద్యాసంస్థలు ఫౌండర్ దాసరి మనోహర్ రెడ్డి తెలిపారు. 2026 విద్యా సంవత్సరానికి గాను నూతనంగా బీటెక్ సిఎస్సి(ఐఓటి) బీటెక్ సిఎస్సి (డాటా సైన్స్) కోర్సులు రెండో విడత కౌన్సిలింగ్‌కు అనుమతి లభించింది. ఈ సందర్భంగా కళాశాల వ్యవస్థాపకులు దాసరి మనోహర్ రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, డాక్టర్ దాసరి మమతా రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలను మొదటి ఆప్షన్‌గా ఎంచుకోవాలని కోరారు. ఈ కళాశాల ప్రతిష్టాత్మకమైన అటానమస్, నాక్ అక్రిడేషన్ పొంది, కేంద్ర ప్రభుత్వంచే ఆమోదం పొందిన ఎంఎస్ఎమ్‌ఈ ఇంక్యుబేషన్ సెంటర్ కలిగిన కళాశాల అని అన్నారు.

# సర్ సర్వే వంద శాతం పూర్తి చేయడానికి కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలి



ఆదిలాబాద్, జులై 18:ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా ఖానాపూర్, పెంబి మండలాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు బూతు లెవల్ ఏజెంట్లు ఓటర్లకు అందుబాటులో ఉంటూ వంద శాతం పూర్తి చేయడానికి కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం ఖానాపూర్ పట్టణ కేంద్రంలోని జై కే ఫంక్షన్ హాల్ లో రెండు మండలాల కార్యకర్తలు, నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేయడంలో ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేస్తూ ఓటర్లకు సహకరించాలని సూచించారు. ఖానాపూర్, పెంబి మండలాల్లో కాంగ్రెస్ కార్యకర్తలకు ఏ సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఖానాపూర్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల కోసం రూ. 20 కోట్ల నిధులు మంజూరు చేశానని త్వరలో పనుల ప్రారంభానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు.

అంతే కాకుండా నియోజకవర్గ రైతుల కోసం ఖానాపూర్ మండలంలో పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం తన వంతు కృషి చేస్తున్నానని స్పష్టం చేశారు. మండలంలో ని ఖానాపూర్ నుండి తర్లపాడు వరకు రోడ్డు వెడల్పు పనులు ప్రారంభించి వాహనదారులు, ప్రయాణికులకు కష్టాలు తొలగించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఖానాపూర్ -బెల్లల్, రాజుర- మందపల్లి రోడ్ల సౌకర్యం మెరుగుపరచనున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలో ఏఎంసి చైర్మన్ భూషణ్, వైస్ చైర్మన్ అబ్దుల్ మజీద్, కౌన్సిలర్లు రాజుర సత్యం, నిమ్మల రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, పి ఏ సి ఎస్ చైర్మన్ లు శ్రీనివాస్ రెడ్డి, అమంద శ్రీనివాస్, ఖానాపూర్ పట్టణ మండల అధ్యక్షులు గౌరై గంగాధర్, జంగిలి శంకర్, ఖానాపూర్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజు నాయక్, ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం, ఖానాపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏఎంసి మాజీ చైర్మన్ కదర్ల గంగ నరసయ్య, నాయకులు దయానంద్, శంకర్, ఖానాపూర్,పెంబి మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చండీగఢ్‌లో వైద్య, విద్య, రహదారి మౌలిక సదుపాయాలకు సంబంధించిన అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు

న్యూఢిల్లీ, జులై 18: చండీగఢ్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు సంబంధించిన ప్రత్యేక దృశ్యాలను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పంచుకున్నారు. క్రమబద్ధమైన దేశ ప్రగతికి చండీగఢ్ ఒక అద్భుతమైన నమూనాగా కొనియాడారు. మెరుగైన జీవనశైలితో పాటు సులభతర జీవనానికి ఈ నగరం ఎంతో పేరుగాంచిందని ప్రశంసించారు. చండీ మాత పవిత్ర ఆశీస్సులు ఉన్న ఈ ప్రాంత క్రమబద్ధమైన, నిరంతర అభివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తి అంకితభావంతో కట్టుబడి ఉంటుందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

చండీగఢ్‌లో వైద్య సదుపాయాల కల్పనతో పాటు మౌలిక సదుపాయాల మెరుగుదల పట్ల అక్కడి ప్రజలు చూపుతున్న ఆసక్తి, ఉత్సాహం స్ఫూర్తిదాయకం.

పరిశుభ్రత పట్ల చండీగఢ్ ప్రజలు ఒక కొత్త విప్లవాన్ని, సరికొత్త చైతన్యాన్ని తీసుకువచ్చారు. ఇందుకోసం అక్కడి నా కుటుంబ సభ్యులందరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను. నేడు దేశవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతున్న ఇటువంటి స్వచ్ఛత ప్రచారాలు ప్రజా ఆరోగ్య పరిరక్షణలో ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

గత 12 సంవత్సరాల కాలంలో మన ప్రభుత్వం ఆరోగ్య సేవల రంగంలో దేశ సామర్థ్యాన్ని ఎంతగానో పెంపొందించింది. దీనివల్ల ఈ రోజు ప్రజలందరికీ అత్యుత్తమ చికిత్స సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. మనం చేసిన ఈ నిరంతర కృషి ఫలితంగానే నేడు భారత్ ప్రపంచ దేశాలకు ఒక ప్రధాన వైద్య పర్యాటక కేంద్రంగా అవతరిస్తోంది.

కేవలం జబ్బులు వచ్చాక చికిత్స అందించడమే కాకుండా.. వ్యాధులు రాకుండా ముందే అడ్డుకునే నివారణ ఆరోగ్య సంరక్షణపై మన ప్రభుత్వం నిరంతరం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. దీనివల్ల దేశంలోని పేదలు, మధ్యతరగతి కుటుంబాలతో పాటు ముఖ్యంగా మన తల్లులు, సోదరీలకు ఎనలేని లబ్ధి చేకూరుతోంది.

# ఎంపికైన వారికి రవీంద్రభారతిలో నియమాక పత్రాలు అందజేత

### -నియామక పత్రాలు అందుకున్న అర్చకులు, పరిచారిక సభ్యులు సంతోషం



ఆదిలాబాద్, జులై 18: రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆయా ఆలయాలకు అర్చక, పరిచారిక, ఇతర పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం గతంలో భర్తీచేసింది. ఇందులో భాగంగా శుక్రవారం హైదరాబాదులోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఆయా ఆలయాల ఈవో చేతుల మీదుగా ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. దీంతో నియామక పత్రాలు అందుకున్న అర్చకులు, పరిచారిక సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. గత 14 సంవత్సరాలుగా రాష్ట్ర దేవదాయ శాఖలో ప్రభుత్వం పోస్టులను భర్తీ చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పోస్టులను భర్తీ చేయడంతో నియామక పత్రాలు అందుకున్న అర్చకులు పరిచారికలు ఇతర సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

ఇందులో భాగంగా బాసర ఆలయానికి ఒక అర్చక,ఒక శ్రీవిద్య పారాయణ దారు, రెండు వేద పండితు లు, నాలుగు పరిచారిక, ఒకటి డోలు విద్వాసుడు, ఒక వంట సహాయకచార్య పోస్టులను ప్రభుత్వం నియమించింది.




# 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఇళ్ల జాబితాతో పాటు గృహ గణన పూర్తి

న్యూఢిల్లీ, జులై 18:ఇళ్ల జాబితా, గృహ గణనకు (హౌస్‌లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్.. హెచ్‌ఎల్‌ఓ) ఉద్దేశించిన స్వీయ గణన (ఎస్‌ఈ) ప్రక్రియను నేడు తమిళనాడు, త్రిపురలో మొదలుపెట్టారు. ఇది '2027 జనగణన' మొదటి దశలో ఒక భాగం. 2026 జులై 31 వరకూ ఈ ప్రక్రియ కొనసాగనుంది. దీని తరువాత 2026 ఆగస్టు 1 నుంచి ఆగస్టు 30 మధ్య ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి, క్షేత్ర సంబంధిత గణన పనులను చేపడతారు.

తమిళనాడు, త్రిపురల ప్రజలు అధికారిక స్వీయ గణన వెబ్‌సైట్ లో స్వీయ గణనను పూర్తి చేయవచ్చు. స్వీయ గణనను పూర్తి చేసిన కుటుంబ సభ్యులు స్వీయ గణన ఐడీ (ఎస్‌ఈ ఐడీ)ని సిద్ధంగా ఉంచుకుని, ఎన్యూమరేటరు క్షేత్ర పర్యటనకు వచ్చిన సమయంలో అందజేయాలి. అలా అందిస్తే, హెచ్‌ఎల్‌ఓ ప్రక్రియ సాఫీగా పూర్తి అవుతుంది.

కేరళ, నాగాలాండ్‌లో ప్రస్తుతం ఇళ్ల జాబితాతో పాటు గృహ గణనకు సంబంధించిన క్షేత్ర స్థాయి కార్యకలాపాలు పురోగమిస్తున్నాయి. ఈ పనులను 2026 జులై 30 వరకూ కొనసాగిస్తారు. స్వీయ గణనకు మొగ్గు చూపని కుటుంబాలను ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లేటప్పుడు వివరాలు అడిగి నమోదు చేసుకుంటారు.

ఇంతవరకు 2027 జనగణనను 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో పూర్తి చేశారు. వీటిలో అండమాన్, నికోబార్ దీవులు, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, బీహార్, చండీగఢ్, ఛత్తీస్‌గఢ్, దాద్రా, నగర్ హవేలీ, దమన్, దీవ్, ఢిల్లీ, గోవా, గుజరాత్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ, కాశ్మీర్, జార్ఖండ్, కర్నాటక, లద్దాఖ్, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మేఘాలయ, మిజోరం, ఒడిశా, పుదుచ్చేరి, పంజాబ్, రాజస్థాన్, సిక్కిం, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ఉన్నాయి.

'2027 జనగణన'లో మొదటి సారి డిజిటల్ పరికరాలను విస్తృత స్థాయిలో ఉపయోగిస్తున్నారు. సమాచారాన్ని మొబైల్ యాప్ ద్వారా సేకరిస్తున్నారు. సమగ్ర, ఖచ్చిత కవరేజీని నిర్ధారించడం కోసం ఇంటింటికి వెళ్లి జనాభా లెక్కలను సేకరించే సాంప్రదాయిక పద్ధతిని కూడా పాటిస్తున్నారు. ఈ దశలో నోటిఫై చేసిన 33 ప్రశ్నలతో కూడిన పత్రాల సాయంతో.. ఇంటి స్థితి, కుటుంబ సభ్యుల వివరాలు, అందుబాటులో ఉన్న సదుపాయాలు, ఆస్తులకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తున్నారు.

'సెన్సస్ చట్టం-1948'లో భాగంగా సేకరించిన సమాచారాన్ని రహస్యంగా ఉంచుతారు. ఆ సమాచారాన్ని గణాంక ప్రక్రియలకీ, అభివృద్ధి పథకాల రూపకల్పనకీ మాత్రమే ఉపయోగిస్తారు. నోటిఫై చేసిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రజలు జన గణన ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలనీ, ఎన్యూమరేటర్లు వచ్చినప్పుడు వారు అడిగిన సమాచారాన్ని ఇచ్చి పూర్తి స్థాయిలో సహకరించాలనీ హోం శాఖ సూచిస్తోంది.

# మోత్కూర్‌లో మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు

## -బి ఆర్ ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు



నల్గొండ, జులై 18:యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను శనివారం స్థానిక మహాత్మా జ్యోతి రావ్ పూలే చౌరస్తా వద్ద బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తల సమావేశంలో బర్త్ డే కేక్ ను ఆ పార్టీ మండల ,పట్టణ అధ్యక్షులు పొన్నెబొయిన రమేష్, జంగ శ్రీను లు కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ అడుగుజాడల్లో పయనించి ,స్వరాష్ట్ర సాధనకు అహర్నిశలు కృషి చేసి,బంగారు తెలంగాణ సాధనలో బాగస్వాములైన జగదీశ్వర్ రెడ్డి మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ కొనతం యాకుబ్ రెడ్డి,రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు కొండ సోంమల్లు,మాజీ సర్పంచ్ లు బయ్యాని పిచ్చయ్య, బత్తిని తిరుమలేష్,సీనియర్ నాయకులు మర్రి అనిల్,గజ్జి మల్లేష్, ఎస్సి,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు దాసరి తిరుమలేష్,సింగిల్ విండో డైరెక్టర్లు సామ పద్మారెడ్డి,పురుగుల మల్లయ్య,నాయకులు కోక బిక్షం,గంగుల రాములు, కూరేళ్ల పరమేష్,మలిపెద్ది మల్లారెడ్డి,మొరిగాల వెంకన్న,శ్రీను,బందెల శ్రీను,ఇంద్రశేఖర్, రమేష్,అన్నం దాసు విద్యాసాగర్,మచ్చగిరి,కల్వల శోభన్ బాబు,ఎడ్ల పాండు,బుర్ర వెంకన్న,తాటి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ముంబయిలో జరగనున్న 'వేవ్స్ 2027' ముందస్తు ఏర్పాట్లపై మహారాష్ట్ర ముఖ్యమంత్రికి వివరాలు అందించిన కేంద్ర సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి

న్యూఢిల్లీ, జులై 18:కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ చంచల్ కుమార్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఈ రోజు మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలిసింది. ముంబయిలో నిర్వహించబోయే రెండో ఎడిషన్ 'ప్రపంచ దృశ్య శ్రవణ వినోద సదస్సు' (వేవ్స్) 2027 ముందస్తు ఏర్పాట్లపై ఈ సందర్భంగా వారు ఒక ప్రాథమిక సమావేశాన్ని నిర్వహించారు. మొదటి ఎడిషన్ 'వేవ్స్ 2025' అద్భుత విజయాన్ని సాధించిందని మహారాష్ట్ర ముఖ్య మంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్ పేర్కొన్నారు. 'వేవ్స్' ప్రారంభ ఎడిషన్ 2025 మే 1 నుంచి 4 వరకు ముంబయిలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. చలనచిత్రాలు, సంగీతం, గేమింగ్, యానిమేషన్, కథలు చెప్పే అద్భుతమైన కళా ప్రపంచాన్ని ప్రదర్శించేలా.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కళాకారులు, క్రియేటర్ల మధ్య సహకారాన్ని పెంపొందించే ఒక అంతర్జాతీయ వేదికగా 'వేవ్స్'ను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్పష్టమైన పిలుపునిచ్చారని శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్ తెలిపారు. ఈ నేపథ్యంలో రెండో ఎడిషన్ 'వేవ్స్' సదస్సును మరింత ఘనంగా విజయవంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం, మహారాష్ట్ర ప్రభుత్వం పరస్పర సమన్వయంతో కలిసి పనిచేయాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

2027లో ముంబయిలో జరగబోయే రెండో ఎడిషన్ 'వేవ్స్' సదస్సు కోసం చేపడుతున్న ముందస్తు ఏర్పాట్లు, కీలకమైన కార్యక్రమాల గురించి ముఖ్యమంత్రికి ఈ సమావేశంలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ చంచల్ కుమార్ వివరించారు.

ఈ సందర్భంగా హాజరైన కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులలో ప్రసార భారతి సీఈఓ శ్రీ గౌరవ్ ద్వివేది, అదనపు కార్యదర్శి శ్రీ ప్రభాత్.. సమాచార-ప్రసార శాఖ డైరెక్టర్ జనరల్ (పశ్చిమ జోన్) శ్రీమతి స్మితా వాట్స్ శర్మ, జాయింట్ సెక్రటరీ (ఐపీ-సీ) శ్రీ సి. సెంథిల్ రాజన్, జాయింట్ సెక్రటరీ (బ్రాడ్‌కాస్టింగ్) శ్రీ పృథుల్ కుమార్, జాయింట్ సెక్రటరీ (ఫిల్మ్స్) డాక్టర్ అజయ్ నాగభూషణ్ ఎం.ఎన్, జాయింట్ సెక్రటరీ (ఇనిస్టిట్యూషన్స్) డాక్టర్ కే.కే. నిరాలా, ఎన్ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ప్రకాష్ మాగ్దుమ్ తదితరులు ఉన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న మహారాష్ట్ర ప్రభుత్వ సీనియర్ అధికారులలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ రాజేష్ అగర్వాల్, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి శ్రీ శ్రీకర్ పరదేశి, ప్రధాన కార్యదర్శి (పరిశ్రమలు, పెట్టుబడులు- సేవలు) డాక్టర్ పీ. అన్బలగన్, బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) కమిషనర్ శ్రీమతి అశ్విని భిడే, డీజీఐపీఆర్ డైరెక్టర్ జనరల్ శ్రీ బ్రిజేష్ సింగ్ తదితరులు ఉన్నారు. ముఖ్యమంత్రితో సమావేశానికి ముందు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ చంచల్ కుమార్.. 'వేవ్స్ 2027' ముందస్తు ఏర్పాట్ల గురించి మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులతో ఒక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

# తెలంగాణ స్పోర్ట్స్ మీట్‌లో పోలీసుల ప్రతిభ..




నిజామాబాద్, జులై 18: హైదరాబాద్‌లో నిర్వహించిన 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్ లో కామారెడ్డి జిల్లా పోలీసు సిబ్బంది ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు సదాశివనగర్ ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ వినయ్ రెడ్డి కరాటే అండర్-60 కేజీల విభాగంలో కాంస్య పతకం,ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్ గౌతమ్ ప్రభు 90 కేజీల రెజ్లింగ్ విభాగంలో కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్ గౌతమ్ ప్రభు 90 కేజీల రెజ్లింగ్ విభాగంలో కాంస్య పతకం సాధించి జిల్లా పోలీసు శాఖకు గౌరవాన్ని తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రాజేష్ చంద్ర, ఐపీఎస్ విజేతలను అభినందించి, వారి కృషి, క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తిని ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో మరిన్ని విజయాలు సాధించి తెలంగాణ పోలీసు శాఖకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# అపూర్వ వాణిజ్య వేదికగా భారత్ టెక్స్ 2026: భారీగా తరలి వచ్చిన సందర్శకులు

న్యూఢిల్లీ, జులై 18:భారత్ టెక్స్ 2026లో మొదటి మూడు రోజుల ప్రదర్శనతో భారత్ మండపం ప్రపంచ జౌళి, దుస్తుల పరిశ్రమకు ఒక ప్రధాన కేంద్రంగా మారింది. ఈ కార్యక్రమానికి దేశీయ, అంతర్జాతీయ భాగస్వాముల నుంచి అపూర్వమైన స్పందన లభించింది. ప్రపంచంలోనే అతిపెద్ద సమగ్ర జౌళి కార్యక్రమం అయిన ఈ ప్రదర్శన.. అత్యధిక సంఖ్యలో సందర్శకుల రాకను, చురుకైన వ్యాపార లావాదేవీలను, విస్తృతమైన కొనుగోలుదారులు-విక్రేతల సమావేశాలను, సరికొత్త విజ్ఞాన మార్పిడికి వేదికగా మారింది. తద్వారా జౌళి రంగంలో నమ్మకమైన ప్రపంచ కొనుగోలు, తయారీ, ఆవిష్కరణలు, పెట్టుబడుల గమ్యస్థానంగా భారత్ ఎదుగుతోందనే విషయాన్ని ఇది మరోసారి చాటిచెప్పింది.

16 లక్షల చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన 'భారత్ టెక్స్ 2026' ప్రదర్శనలో 1647 మంది ప్రదర్శకులు, దాదాపు 95000 మంది వ్యాపార సందర్శకులు (వీరిలో 20,000 మందికి పైగా పునరావృత సందర్శకులు ఉన్నారు), 6090 మంది అంతర్జాతీయ కొనుగోలుదారులతో కలిపి మొత్తం 11315 మంది కొనుగోలుదారులు, 138 దేశాల నుంచి 3,461 మంది ప్రతినిధులు- భాగస్వాములు ఒకే వేదికపైకి వచ్చారు. ఇది భారత్‌లో వేగంగా విస్తరిస్తున్న జౌళి వ్యవస్థపై అంతర్జాతీయంగా ఉన్న అపూర్వమైన నమ్మకాన్ని తెలియజేస్తోంది. మొదటి మూడు రోజుల్లోనే 28,500 కంటే ఎక్కువ బీటూబీ సమావేశాలు, 100 కంటే ఎక్కువ బీటూజీ- జీటూజీ పరస్పర చర్చలు, పలు వ్యూహాత్మక పెట్టుబడి చర్చలతో ప్రదర్శన హాల్స్ అన్నీ ఎంతో సందడిగా మారాయి. భారత జౌళి, దుస్తుల రంగంలో వికేంద్రీకృత, రాష్ట్రాల నేతృత్వంలోని వృద్ధిని ముందుకు తీసుకెళ్లటంలో ఈ కార్యక్రమం కీలకపాత్ర పోషించింది. వివిధ రాష్ట్రాలు కుదుర్చుకున్న 30కి పైగా అవగాహన ఒప్పందాల (ఎంఓయూ) ద్వారా 'భారత్ టెక్స్ 2026' దాదాపు రూ. 14,300 కోట్ల జౌళి పెట్టుబడులకు ఉత్ప్రేరకంగా మారింది. పెట్టుబడులు పొందిన రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ (రూ. 4,100 కోట్ల పెట్టుబడి), కర్ణాటక (రూ. 2,821 కోట్ల పెట్టుబడి, 11020 ఉద్యోగాలు), బీహార్ (రూ. 1476 కోట్ల పెట్టుబడి, 40500 కంటే ఎక్కువ ఉద్యోగాలు), మహారాష్ట్ర (రూ. 1095 కోట్ల పెట్టుబడి) ఉన్నాయి. ఆర్ఈ-యూపీ సంస్థ భారత్‌లో రూ. 4,800 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ కార్యక్రమం ద్వారా సుమారు 2.8 బిలియన్ డాలర్ల విలువ కలిగిన వ్యాపారంగా ఆసక్తి వ్యక్తీకరణలు వచ్చాయి.

ఈ కార్యక్రమంలో రాష్ట్రాలు కీలక పాత్ర పోషించాయి. బీహార్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు 'భాగస్వామ్య రాష్ట్రాలుగా' పాల్గొన్నాయి. మరికొన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కేటాయించిన ప్రత్యేక పెవీలియన్ల ద్వారా తమ జౌళి రంగ సామర్థ్యాన్ని ప్రదర్శించాయి. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్, పంజాబ్ ముఖ్యమంత్రి శ్రీ భగవంత్ సింగ్ మాన్‌లతో పాటు మహారాష్ట్ర, తమిళనాడు, అస్సాం, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు చెందిన సీనియర్ మంత్రులు హాజరయ్యారు. ఇది భారతదేశపు అత్యున్నత జౌళి వేదికగా 'భారత్ టెక్స్'కు ఉన్న ప్రాముఖ్యతను మరింతగా తెలియజేసింది.

ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ భాగస్వామ్యం కూడా అదే స్థాయిలో ఉంది. న్యూజిలాండ్, శ్రీలంక, రష్యా, కంబోడియా, పోర్చుగల్ దేశాల నుంచి మంత్రుల బృందాలు హాజరవగా ఐరోపా సమాఖ్య ప్రతినిధులు కూడా ఇందులో పాల్గొన్నారు. అమెరికా, జపాన్, యూకే, స్పెయిన్, ఇటలీ, దక్షిణ కొరియా, యూఏఈ, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, జర్మనీతో సహా పలు దేశాల నుంచి 30కి పైగా పరిశ్రమ, అంతర్జాతీయ వ్యాపార ప్రతినిధి బృందాలు ఈ ప్రదర్శనలో చురుగ్గా పాల్గొన్నాయి.

ఈ కార్యక్రమంలో విజ్ఞాన మార్పిడి ఒక ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇక్కడ ఏర్పాటు చేసిన 100 అత్యున్నత స్థాయి నాలెడ్జ్ సెషన్లలో 600 మందికి పైగా విధాన నిర్ణేతలు, అంతర్జాతీయ నిపుణులు, పరిశ్రమల అధిపతులు, సీఎక్స్‌ఓలు, విద్యావేత్తలు పాల్గొన్నారు. ప్యానెల్ చర్చలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు, మాస్టర్‌క్లాస్‌లలో ప్రపంచ వాణిజ్య విధానాలు, సుస్థిరత, చక్రీయత, సాంకేతిక ఆవిష్కరణలు, కృత్రిమ మేధ, బాధ్యతాయుతమైన కొనుగోళ్లు, పెట్టుబడి అవకాశాలు, సాంకేతిక వస్త్రాలు వంటి కీలక అంశాలపై లోతైన చర్చలు జరిగాయి. ఈ ప్రదర్శనలో ప్రత్యేకంగా నిలిచిన వాటిలో 'టీబీడీ పెవీలియన్' వద్ద నిర్వహించిన 'సంరచన హాకథాన్' ఒకటి. ఇది సాంకేతిక వస్త్రాల రంగంలో భారతీయ యువ ఆవిష్కర్తల నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది. రైతులకు రక్షణ కల్పించే దుస్తులు, అధునాతన డయాబెటిక్ గాయాలకు సంబంధించిన సంరక్షణ ఉత్పత్తుల నుంచి మారుమూల శీతల వాతావరణం తట్టుకునే తేలికపాటి ఇన్సులేటెడ్ పరుపుల వరకు ఎన్నో ఆచరణాత్మక పరిష్కారాలను దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, ఆవిష్కర్తలు ప్రదర్శించారు. కేంద్ర జౌళి శాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్.. కేంద్ర జౌళి, విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీ పవిత్ర మార్గరీటా ప్రశంసించిన ఈ పరిష్కారాలు.. తదుపరి తరం సాంకేతిక వస్త్రాల అభివృద్ధిలో విద్యాసంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వం కలిసి పనిచేయడం వల్ల వచ్చే విప్లవాత్మక మార్పును నిరూపించింది. సమ్మిళిత వృద్ధిని ప్రోత్సహించే మరో కీలకమైన చొరవలో భాగంగా.. భారత్‌లోని ఆకాంక్షిత జిల్లాల నుంచి వచ్చిన 250 మందికి పైగా నూతన పారిశ్రామికవేత్తలు, చేనేత కార్మికులకు ప్రత్యేక ఎక్స్‌పోజర్ పర్యటనలను 'భారత్ టెక్స్ 2026' నిర్వహించింది. ఈ కార్యక్రమం ద్వారా ఎంఎస్ఎమ్ఈలు నేరుగా కొనుగోలుదారులు, ప్రదర్శకులు, పరిశ్రమ నిపుణులతో సంభాషించడానికి అవకాశం లభించింది. అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలు, బ్రాండింగ్, ఉత్పత్తి ఆవిష్కరణలు, ఎగుమతి అవకాశాలపై వీరికి లభించిన విలువైన అవగాహన.. క్షేత్రస్థాయిలో వ్యాపార నైపుణ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది. ప్రపంచ దుస్తుల తయారీ రంగంలో పెరుగుతున్న భారత్ ప్రభావాన్ని మరింత చాటుతూ.. ఇంటర్నేషనల్ అప్పారెల్ ఫెడరేషన్ (ఐఏఎఫ్) బోర్డు సమావేశం కూడా 'భారత్ టెక్స్ 2026'తో పాటే ఇక్కడే నిర్వహించారు.

'భారత్ టెక్స్ ట్రేడ్ ఫెడరేషన్' (బీటీటీఎఫ్), ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన టెక్స్‌టైల్- ఫ్యాషన్ సోర్సింగ్ ప్లాట్‌ఫామ్‌లలో ఒకటైన 'ప్రీమియర్ విజన్ పారిస్'.. ఒక ఆసక్తి వ్యక్తీకరణ పత్రంపై (ఎల్‌ఓఐ) సంతకాలు చేశాయి. ఇది ఈ మొత్తం కార్యక్రమంలో ఒక కీలక ఘట్టంగా నిలిచింది. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం మార్కెట్ యాక్సెస్, సుస్థిర కొనుగోళ్లు, డిజైన్ ఇంటెలిజెన్స్, కొనుగోలుదారులు-విక్రేతల మధ్య బంధాన్ని మెరుగుపరచడం ద్వారా భారత్-ఐరోపా సమాఖ్య జౌళి భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇది భారతీయ తయారీదారులు, ఎగుమతిదారులు, ఎంఎస్ఎమ్ఈలకు సరికొత్త అంతర్జాతీయ అవకాశాలను సృష్టిస్తుంది. భారతదేశ సంప్రదాయ జౌళి సంపదను అంతర్జాతీయ ప్రీమియం బ్రాండ్‌లుగా ఎలా తీర్చిదిద్దాలనే అంశంపై కూడా 'భారత్ టెక్స్ 2026' వేదికగా అర్థవంతమైన చర్చలు జరిగాయి. ప్రముఖ డిజైనర్లు రాహుల్ మిశ్రా, వైశాలి షడంగూలేలతో పాటు పరిశ్రమల అధిపతులు.. భారత్‌కు ఉన్న హస్తకళలు, చేనేత, సంప్రదాయ నేత విషయంలో సుసంపన్నమైన వారసత్వాన్ని, వారి అద్భుతమైన నైపుణ్యం, సాంస్కృతిక కథనాల ద్వారా అంతర్జాతీయ మార్కెట్లలో దేశానికే ఒక ప్రత్యేకమైన గుర్తింపుగా మార్చవచ్చని చెప్పారు.

ప్రత్యేకమైన థీమాటిక్ పెవీలియన్లలో ముమ్మరంగా సాగిన వ్యాపార కార్యకలాపాలతో ప్రదర్శన ప్రాంగణం అంతా సందడిగా మారింది. 4వ నంబర్ హాల్‌లో సీఎంఏఐ ఏర్పాటు చేసిన 'బ్రాండ్స్ ఆఫ్ ఇండియా' పెవీలియన్ ప్రధాన ఆకర్షణలలో ఒకటిగా నిలిచింది. ఇది 70కి పైగా ప్రముఖ భారతీయ దుస్తుల బ్రాండ్లను ఒకే చోటకు చేర్చి కొనుగోలుదారులకు భారత వైవిధ్యభరితమైన ఫ్యాషన్, వస్త్ర రంగ వ్యవస్థను అద్భుతంగా ప్రదర్శించింది. మొదటిసారిగా ఈ పెవీలియన్ వేగంగా విస్తరిస్తున్న భారత లోదుస్తుల (ఇంటిమేట్ - ఇన్నర్‌వేర్) రంగానికి ప్రత్యేక స్థానాన్ని కల్పించింది. ముంబయి, ఢిల్లీకి చెందిన ప్రముఖ బ్రాండ్లు తమ సరికొత్త ఆవిష్కరణలను ఇక్కడ ప్రదర్శించాయి. వెస్ట్‌సైడ్, టామీ హిల్‌ఫిగర్, కాల్విన్ క్లైన్, యూఎస్ పోలో అసోసియేషన్, యారో, ఫ్లయింగ్ మెషిన్, లూయిస్ ఫిలిప్, వాన్ హ్యూసెన్, అలెన్ సోలీ, పీటర్ ఇంగ్లాండ్, రీబాక్, అమెరికన్ ఈగిల్, రాల్ఫ్ లారెన్, సబ్యసాచి, తరుణ్ తహిలియాని, జైపూర్, డబ్ల్యూ ఫర్ ఉమెన్, బెవకూఫ్, డాలర్, బాడీకేర్, డ్యూక్ వంటి పలు అంతర్జాతీయ, భారతీయ బ్రాండ్లు కొనుగోలుదారులను, రిటైలర్లను ఎంతగానో ఆకర్షించాయి. సీఎంఏఐ, గ్లోబల్ అలయన్స్ ఫర్ టెక్స్‌టైల్ సస్టైనబిలిటీ (గ్యాట్స్) సంయుక్తంగా సమర్పించిన 'ఎకో-స్టిచ్ సస్టైనబిలిటీ - సర్క్యులారిటీ హబ్' ద్వారా 'భారత్ టెక్స్ 2026'లో సుస్థిరత ఒక ప్రధానాంశంగా నిలిచింది. 'సుస్థిర, చక్రీయ, పోటీతత్వ భారత్' అనే ఇతివృత్తంతో రూపొందించిన ఈ పెవీలియన్.. రీసైక్లర్లు, తయారీదారులు, బ్రాండ్లు, ఆవిష్కర్తలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే సంస్థలు, పర్యావరణ భాగస్వాములను ఒకే వేదికపైకి తెచ్చింది. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన 'ఇండియా ఇంపాక్ట్ వాల్, సర్క్యులారిటీ ఎట్ స్కేల్, ఫ్రమ్ వేస్ట్ టు గ్లోబల్ వార్డ్‌రోబ్, మేడ్ ఇన్ సర్క్యులర్ భారత్, మెటీరియల్ అండ్ ఇన్నోవేషన్ లైబ్రరీ, సర్క్యులర్ భారత్ ఫోరమ్ వంటి ప్రత్యేక జోన్లు.. మరింత పర్యావరణ అనుకూలమైన జౌళి భవిష్యత్తు వైపు సాగడానికి ఆచరణాత్మక మార్గాలను విజయవంతంగా ప్రదర్శించాయి.

కిక్కిరిసిన ప్రదర్శన శాలలు, సందడిగా సాగిన సదస్సులు, చురుకైన వ్యాపారానుబంధాలు, ప్రదర్శన ప్రాంగణమంతటా వ్యక్తమైన బలమైన వ్యాపార భాగస్వామ్యాలతో 'భారత్ టెక్స్ 2026' మునుపెన్నడూ లేని ఉత్సాహంతో కొనసాగుతోంది. జౌళి రంగ తయారీ, కొనుగోళ్లు, సరికొత్త ఆవిష్కరణలు, బాధ్యతాయుతమైన వృద్ధిలో ప్రపంచ దేశాల మొదటి ప్రాధాన్యతగా నిలవాలనే భారత దేశ దార్శనికతను ఇది మరింత బలోపేతం చేస్తోంది. అంతర్జాతీయ జౌళి, దుస్తుల విలువ గొలుసులో దేశ నాయకత్వ స్థానాన్ని ఈ ప్రదర్శన మరోసారి సుస్థిరం చేసింది.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై బీజేపీ 'ఇందూరు రణభేరి'.. ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు




నిజామాబాద్, జులై 18: రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో శుక్రవారం 'ఇందూరు రణభేరి' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్ నాయకత్వంలో పాత కలెక్టరేట్ సమీపంలోని ధర్నా చౌక్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శించారు.

ఈ సందర్భంగా నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ హామీని అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. బకాయిల చెల్లింపుల కోసం వేల కోట్ల రూపాయలు అవసరమున్నప్పటికీ కేవలం రూ.200 కోట్లు మాత్రమే విడుదల చేయడం విద్యార్థులను మోసం చేసినట్టేనని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం భూముల విక్రయాల ద్వారా వచ్చిన నిధులు ఎక్కడ ఖర్చు చేశారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కారణంగా రాష్ట్రంలోని సుమారు 14 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ ఎంతో కీలకమైన పథకమని, దానిని నిర్వీర్యం చేయడం బాధాకరమని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలోనే రూ.300 నుంచి రూ.400 కోట్ల వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, ప్రభుత్వం పూర్తిస్థాయిలో బకాయిలు విడుదల చేసే వరకు బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రజాప్రతినిధులు, జిల్లా నాయకులు, విద్యార్థి విభాగం ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇండియన్ బ్రాండ్లు, డిజైనర్లు, నేత కళాకారులు ఇక అంతర్జాతీయం ఇదే మంచి తరుణమన్న మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్




న్యూఢిల్లీ, జులై 18: భారత దేశంలో నేడు ఫ్యాషన్, దుస్తుల పరిశ్రమ ముఖచిత్రం పూర్తిగా మారిపోతున్నది. సంప్రదాయ తయారీ సామర్థ్యానికి మించి ముందుకు వెళ్తూ, కొత్త డిజైన్ల ఆవిష్కరలూ, నాణ్యత, సాంస్కృతిక విశిష్టత పరంగా అంతర్జాతీయ గుర్తింపును సాధిస్తోంది.

2025-26లో భారత జౌళి, దుస్తుల ఎగుమతులు సుమారు రూ.3.16 లక్షల కోట్లకు చేరు కోగా, ఈ ఎగుమతుల్ని 2030 కల్లా రూ.9 లక్షల కోట్ల స్థాయికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల (ఎఫ్‌టీఏల) పరిధిని విస్తరిస్తూ ప్రధాన అంతర్జాతీయ మార్కెట్లకు వెళ్లాలనీ, భారతీయ వాణిజ్య సంస్థలు పటిష్ఠ ఉత్పత్తుల్ని బ్రాండు రూపంలో ఆవిష్కరిస్తూ ఎప్పటిక ప్పుడు మారే వినియోగదారుల అభిరుచులకూ, నియంత్రణలకు అనుగుణంగా పోటీ పడే స్వభావా న్ని పెంచుకోవాలనీ, నాణ్యతను అందించడం ద్వారా అంతర్జా తీయ స్థాయికి వెళ్లాలన్న అంశా ల్ని ఈ కార్యక్రమంలో చర్చించారు.

ఈ నేపథ్యంలో, "భారతీయ బ్రాండ్లు, అంతర్జాతీయ ఆకాంక్షలు: సరిహద్దులకు ఆవల రిటైల్ అభివృద్ధికి సరికొత్త రూపును ఇవ్వడం" అన్న అంశంపై ఒక కార్యక్రమాన్ని న్యూఢిల్లీలోని భారత్ మండపంలో 2026, జూలై 16న నిర్వహించారు. డిజైనర్లు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పాటు ఎలక్ట్రానిక్ వాణిజ్య సంస్థలు, తయారీదారు సంస్థల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భారతీయ జౌళి, లైఫ్‌స్టైల్ బ్రాండ్లు, సాంప్రదాయిక కళల్నీ, వారసత్వాన్నీ నిలబెట్టుకుంటూనే అంతర్జాతీయ మార్కెట్లలో ఏ విధంగా విస్తరించవచ్చో చర్చించారు. ఈ కార్యక్రమంలో 20 మందికి పైగా ప్రముఖ ప్యానలిస్టులు పాలుపం చుకున్నారు. భారతీయ బ్రాండ్లకు చెందిన వారు, లగ్జరీ డిజైనర్లు, ఈ-కామర్స్ సంస్థలు, పీడీఎస్, వెల్‌స్పన్ వరల్డ్, నెయాట్ హోమ్స్, వశ్మీనాడాట్‌కామ్, ఎక్స్‌పోబజార్, ట్రైడెంట్ లకు చెందిన వారు, పరిశ్రమ ప్రముఖులు ఉన్నారు. భారతీయ బ్రాండ్లను అంతర్జాతీయ స్థాయికి తీసుకుపోయేందుకూ, రిటైల్ రంగంలో పోటీపడే తత్వాన్ని అలవరచుకునేందుకూ, నూతన ఆవిష్కరణల సాయంతో అంతర్జాతీయ స్థాయికి వెళ్లేందుకు... ప్యానలిస్టులు అనేక సూచనలు చేశారు.

భారతీయ జౌళి, దుస్తుల బ్రాండ్ల ప్రతినిధులు, డిజైనర్లు, ఈ-కామర్స్ సంస్థలు, రిటైల్ వ్యాపారులు, ఎగుమతిదారులు, నూతన ఆవిష్కరణల రంగ నిపుణుల్ని ఉద్దేశించి కేంద్ర జౌళి శాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్ ప్రసంగించారు. భారత జౌళి రంగ భవిష్యత్తుతో ముడిపడిన స్ఫూర్తిదా యక అభిప్రాయాలను ఈ సంద ర్భంగా మంత్రి వ్యక్తం చేశారు. దేశ విశిష్ట వస్త్ర సంప్రదాయాల్నీ, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షి స్తూ అంతర్జాతీయ స్థాయిలో విశ్వ సనీయ బ్రాండ్లను ఆవిష్కరిం చడానికి భారతీయ చేతివృత్తి కళాకారులకీ, డిజైనర్లకీ, సూక్ష్మ చిన్న మధ్యతరహా వాణిజ్య వ్యవస్థ (ఎమ్ఎస్ఎమ్ఈ)కీ అపార అవకాశాలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.

అంతర్జాతీయ మార్కెట్లలో విజయాన్ని చేజిక్కించుకోవడానికి భారతీయ బ్రాండ్లు రాశితో పాటు వాసి, స్థిరత్వం, విస్తరణపై దృష్టిని కేంద్రీకరించాలని మంత్రి సూచిం చారు. "చేతివృత్తి కళాకారులు భారత్‌కు పెన్నిధి" అని మంత్రి వ్యాఖ్యానించారు. భారతదేశ జౌళి రంగ విస్తారిత అనుబంధ వ్యవస్థకు కీలకం చేతివృత్తి కళాకారులూ, చేనేత కార్మికులేనని ఆయన పునరుద్ఘాటించారు. చేతివృత్తి కళాకారుల పనితనాన్ని లోకానికి చాటడం, వారిని అంతర్జాతీయ కొనుగోలు సంస్థలతో అనుసంధానించడం, భారత ఘన జౌళి వారసత్వాన్ని పరిరక్షించడంలో 'భారత్ టెక్స్ 2026' వంటి కార్యక్రమాలు కీలక పాత్రను పోషిస్తున్నాయని శ్రీ గిరిరాజ్ సింగ్ అన్నారు.

నాణ్యత, స్థిరత్వం, ఘన వారసత్వాలు, కళాకౌశలం సాయంతో భారతీయ బ్రాండ్లు తమ అంతర్జాతీయ ఆకాంక్షల్ని నెరవేర్చుకుంటూ అభివృద్ధిలో కొత్త అధ్యాయాన్ని జోడించడానికి ఇది అనువైన తరుణమని మంత్రి అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆదరణకు నోచుకొనేట్టు భారత విశిష్ట హస్తకళల వారసత్వాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. తయారీ సంస్థలు, చేతివృత్తి కళాకారులు, చేనేతదారులు భారత్‌కున్న అత్యంత గొప్ప బలమని ఆయన చెబుతూ, జౌళి రంగంలో సమ్మిళిత అభివృద్ధితో పాటు ప్రపంచ స్థాయిలో పోటీ పడగలిగిన అభివృద్ధిని సాధించాలంటే అందుకు చేతివృత్తి కళాకారులకీ, చేనేతదారులకీ సాధికారతను కల్పించడం ఎంతో అవసరమని శ్రీ గిరిరాజ్ సింగ్ అన్నారు.

భారతీయ బ్రాండ్లకు, హస్తకళలకూ అంతర్జాతీయ స్థాయిలో ప్రాధాన్యం పెరుగుతోందని ప్రసిద్ధ భారతీయ డిజైనర్లు వైశాలీ షడంగులే, శ్రీ రాహుల్ మిశ్రా అన్నారు. కేవలం నాలుగు చేనేత కుటుంబాలతో తన ప్రయాణాన్ని మొదలుపెట్టినట్లు, ఈ ప్రస్థానం ప్రస్తుతం ఒక పెద్ద సమాజంగా మారినట్లు, చేనేత సిబ్బందిలో 90 శాతానికి పైగా యువతులే ఉన్నట్లు వైశాలీ షడంగులే చెప్పారు. తాము సాంప్రదాయిక కళలను సంరక్షిస్తూనే సుస్థిర జీవనోపాధిని పొందుతున్నట్లు ఆమె తెలిపారు. భారత్‌కు చెందిన, అంతరించిపోయిన 100 నేత సంప్రదాయాల్ని పునరుద్ధరించాలన్నదే తన లక్ష్యమని ఆమె ఈ సందర్భంగా వెల్లడించారు. "మీరు అంతర్జా తీయ మార్కెట్టులో మీదైన గుర్తింపును పొందాలను కుంటు ంటే, భారతీయ చేనేతల విశిష్టతలతో పాటు వాటికి ఉన్న శక్తిని ప్రపంచం ఎదుట ఆవిష్కరించాలి" అని వైశాలీ షడంగులే అన్నారు. ఏదైనా ఒక బ్రాండుకు ఉండే అతి పెద్ద బలం ఆ బ్రాండుకు ఉన్న ప్రామాణిక సమాచారాన్ని తెలియజేయడమేనని జైపూర్ రగ్స్ వ్యవస్థాపకుడు శ్రీ నంద్ కిశోర్ చౌదరీ అన్నారు. ఒక బ్రాండు తన మూలాలూ, సంప్రదాయాలూ, వారసత్వంతో బలంగా పెనవేసుకొన్నప్పుడు దానిని అనుకరించడం పోటీ సంస్థలకు కష్టం అవుతుందని ఆయన వివరించారు.

స్వదేశీ హస్తకళలను పెంచి పోషించుకోవాలని శ్రీ రాహుల్ మిశ్రా అన్నారు. "ప్రతి దేశానికీ సరిపడేట్టు డిజైన్లలో మార్పు చేర్పులు చేసే బదులు, భారతీయత ఉట్టిపడే కళాత్మకతకే కట్టుబడి ఉండటంపై దృష్టి పెట్టాలి. మౌలికత్వాన్నీ, ప్రామాణికతనీ కాపాడుకోవడానికి శ్రద్ధ తీసుకోవాలి.. ఈ ప్రామాణికత్వమే భారతీయ బ్రాండుల గొప్పతనం" అని ఆయన అన్నారు. "చేతులతో తయారు చేసిన వస్తువులూ, చేనేతలే భారత్ ఆత్మకు ప్రతీక. ప్రత్యేకించి ఈ కృత్రిమ మేధ కాలంలో వీటి ప్రాధాన్యం మరింతగా పెరిగిపోతుంది" అని కూడా ఆయన వివరించారు.

అంతర్జాతీయ స్థాయి వాణిజ్య కార్యకలాపాలకు మార్కెట్లూ, బహుళ విధ అమ్మకాలకు తోడ్పడే వ్యూహాలూ కీలకంగా మారాయని ఈ-కామర్స్ రంగ ప్రముఖులు అన్నారు. వాణిజ్య కార్యకలాపాలను అంతర్జాతీయ స్థాయికి విస్తరించడానికి చాలా కాలం పడుతుందనీ, కానీ ఒక సారి ఈ లక్ష్యాన్ని చేరుకొంటే దీనికి దీర్ఘకాలిక స్థిరత్వంతో పాటు నిరంతర అభివృద్ధి కూడా నిర్ధారితం అవుతుందనీ వారు చెప్పారు. అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్ కంట్రీ హెడ్ శ్రీనిధి కల్వపూడి మాట్లాడుతూ తమ సంస్థ 2 లక్షల కన్నా ఎక్కువ మంది అమ్మకందారులకు తోడ్పాటును అందిస్తోందన్నారు. వారిలో రెండో అంచె, మూడో అంచె నగరాలకు చెందిన చేతివృత్తుల వారు చాలా మంది ఉన్నారని తెలిపారు. బ్రాండును తీర్చిదిద్దడానికి ప్రాధాన్యాన్ని ఇవ్వాలని ఆమె చెబుతూ, "భారత్ మరిన్ని ఎగుమతులు చేయడానికి తోడు, అంతర్జాతీయ స్థాయిలో దీర్ఘకాలం పాటు గుర్తుపెట్టుకొనే విధంగా ఖ్యాతిని కూడా సంపాదించుకోవాలి" అని అన్నారు. "బ్రాండ్లను రూపొందించడం ఇప్పుడు కేవలం ఒక ఐచ్ఛికం కాదు.. మనుగడలో ఉండాలంటే తప్పక చేయవలసిన పనిగా మారిపోయింది" అని శ్రీనిధి కల్వపూడి స్పష్టం చేశారు. సాంకేతికత పోషించే పాత్ర, డేటా, ఏఐ, ప్రాంతీయ భాషల్లోనూ ఏఐ ఆధారిత సేవల్ని వినియోగించుకోవడానికి ఉన్న అవకాశాల్ని గురించి వక్తలు ప్రస్తావించారు. విశ్వసనీయతా ప్రమాణచిహ్నం, నమూనా లాజిస్టిక్స్ సహకారం, బిజినెస్-టు-కన్స్యూమర్ ఎగుమతులకు ప్రోత్సాహకాలు ఇవ్వడం వంటి చర్యలతో భారతీయ బ్రాండులను అంతర్జాతీయ స్థాయికి విస్తరించవచ్చని వారు అన్నారు.

భారత ఉత్పాదన రంగ విస్తారిత అనుబంధ వ్యవస్థనీ, సరఫరా వ్యవస్థల్నీ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే తత్వాన్నీ బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతయినా ఉందని భారీ స్థాయి తయారీదారు సంస్థల ప్రతినిధులు ప్రస్తావించారు. క్లస్టర్ అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను రిలయన్స్ ఇండస్ట్రీస్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంటు, కార్పొరేట్, పరిశ్రమ వ్యవహారాల అధిపతి డాక్టర్ అనిల్ రాజ్‌వంశీ ప్రశంసించారు. ఏకీకృత తయారీ విస్తారిత అనుబంధ వ్యవస్థ భారతీయ బ్రాండ్లకు ఎక్కువగా ఉత్పత్తి చేయగల స్తోమతనీ, దక్షతనీ అందించగలదని ఆయన అన్నారు. ట్రెంట్ మేనేజింగ్ డైరెక్టరు శ్రీ వెంకటేశాలు పళనిస్వామి మాట్లాడుతూ, భారత్ తన విలువని సృష్టించే మార్గంలో ప్రతి ఒక్క అంచెలో అధిక పారదర్శకత్వాన్నీ, వేగాన్నీ నిర్ధారించుకుంటూ జౌళి రంగానికి బలమైన అంతర్జాతీయ గుర్తింపును సంపాదించుకోవాల్సి ఉందన్నారు. అలాంటి గుర్తింపునకు మంచి నాణ్యత, చెప్పిన సమయానికి సరకును అందించేటట్లు చూడడంతో పాటు నిరంతరాయ ప్రాతిపదికన సేవల లభ్యత.. ఇవి పునాదిగా నిలవాలన్నారు. భారత్ కీలక బలాల్లో ఒకటైన పత్తిని శుద్ధిపరిచి, బ్రాండుగా తీర్చిదిద్దే పనులు విదేశాల్లో ఎందుకు జరగాలని కూడా వక్తలు ప్రశ్నిం చారు. నాస్‌కామ్‌లాంటి ఒక కేంద్రీయ సంస్థను ఏర్పాటు చేయాలనీ, అది అంతర్జాతీయ బ్రాండును రూపొందించడానికి పరిశ్రమకు మొదటి దశ నుంచి చివరి దశ వరకూ సంపూర్ణ సహకారాన్ని అందించే స్థితిలో ఉండాలనీ వారు అభిప్రాయ పడ్డారు. అంతర్జాతీయ మార్కెట్ల వరకూ చేరుకోవాలంటే దీర్ఘకాలిక అభివృద్ధి ఒక ముఖ్య ఆధారంగా మారిందనీ, పెద్ద ఎగుమతిదారు సంస్థలకూ, డిజైనర్లకూ మధ్య సహకారం పుంజుకొనేట్టు చేస్తే ఉత్పాదన స్తోమతకీ, సృజనశీలత్వానికీ మధ్య ప్రభావపూర్వక సమన్వయాన్ని ఏర్పరచవచ్చునీ సూచించారు.

ఈ అభిప్రాయాలను కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ అధికారులు సమర్థించారు. భారత్ ఎక్కువ పరిమాణంలో ఉత్పాదనలను విక్రయించడం ఒక్కటే కాకుండా, శ్రేష్ఠమైన నాణ్యతను కూడా అందిస్తోందని ఐటీపీఓ చైర్మన్ శ్రీ జావేద్ అశ్రఫ్ అన్నారు. 'భారత్‌లో తయారీ' అనే గుర్తింపు.. ఉన్నత ప్రమాణాలు కలిగిన నాణ్యతకు మారుపేరుగా నిలవాలనీ, ప్రదర్శనలు ఎమ్ఎస్ఎమ్ఈలకు నేటికీ కీలక అవకాశాలుగా కొనసాగుతున్నాయనీ ఆయన అన్నారు. జౌళి శాఖ కార్యదర్శి శ్రీమతి నీలమ్ శమీరావు మాట్లాడుతూ శక్తిమంతమైన డిజైనర్ హౌసులూ, ఉమ్మడి ప్రాతిపదికన వినియో గించుకోదగ్గ మౌలిక సదుపాయాలు, ఈ-కామర్స్ సంస్థల సేవలను వినియోగించుకొనే పరిస్థితీ చాలా ముఖ్యమని సూచించారు. బ్రాండును రూపొందించడం ఒక దీర్ఘకాలిక ప్రక్రియ అని ఆమె అన్నారు.

# భవిష్యత్ బయోటెక్నాలజీ కోసం శ్రామిక శక్తి నిర్మాణం లక్ష్యంగా భారత తొలి ఇంజనీరింగ్ బయాలజీ గ్రాడ్యుయేషన్ కోర్సును ప్రకటించిన కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, జులై 18:భారత తొలి ఇంజనీరింగ్ బయాలజీ గ్రాడ్యుయేషన్ కోర్సును ప్రవేశపెడుతున్నట్లు కేంద్ర శాస్త్ర, సాంకేతిక, భూ విజ్ఞాన శాస్త్రాల శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), ప్రధానమంత్రి కార్యాలయం, అణుశక్తి, అంతరిక్ష, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పింఛన్ల శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ రోజు ప్రకటించారు. దేశపు దీర్ఘకాలిక శాస్త్రీయ, ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక ఆకాంక్షలకు మద్దతునివ్వగల స్వతంత్ర, స్వయం-సమృద్ధ బయోటెక్నాలజీ వ్యవస్థను నిర్మించడంలో కీలక ముందడుగుగా దీనిని ఆయన అభివర్ణించారు.

"2035 నాటికి దేశాన్ని ప్రపంచంలోనే ప్రముఖ బయోఎకానమీ కేంద్రంగా నిర్మించడం" లక్ష్యంగా రూపొందించిన రోడ్‌మ్యాప్‌ను కేంద్ర మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ, కంప్యూటర్ సైన్స్ డిజిటల్ విప్లవాన్ని నడిపించినట్లే, ఇంజనీరింగ్ బయాలజీ భారత బయోఎకానమీ తదుపరి దశ కోసం విజ్ఞానశాస్త్రపు పునాదిగా ఆవిర్భవిస్తుందని అన్నారు. ఇంజనీరింగ్, బయాలజీ, ఆరోగ్య సంరక్షణ రంగాల మధ్య పెరుగుతున్న సమ్మేళనాన్ని ప్రతిబింబిస్తూ... ఐఐటీలు ఇప్పటికే వైద్య సంస్థలతో అంతర్విభాగ కార్యక్రమాల కోసం ప్రతిపాదనలు సమర్పించడం ప్రారంభించాయని ఆయన తెలిపారు. ఆవిష్కరణ కార్యక్రమ ప్రారంభానికి ముందు రోడ్‌మ్యాప్ ప్రజెంటేషన్, పరిశ్రమ దృక్పథాలు, సీనియర్ విధానకర్తల ప్రసంగాలు జరిగాయి.

"మన సొంతమైన స్వతంత్ర, స్వయం-సమృద్ధ వ్యవస్థ మనకు ఉండాలి'' అని కొత్త కోర్సు ప్రారంభాన్ని ప్రకటిస్తూ డాక్టర్ జితేంద్ర సింగ్ వ్యాఖ్యానించారు. ఇది దేశంలోనే ఈ తరహా తొలి కోర్సుగా నిలుస్తుందన్నారు. ఇంజనీరింగ్, జీవశాస్త్రం, వైద్యం, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల సమ్మేళనంలో పనిచేయడానికి సన్నద్ధులైన కొత్త తరం నిపుణులను ఇది తయారు చేస్తుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

గత దశాబ్దంలో బయోటెక్నాలజీ రంగంలో భారత్ సాధించిన వేగవంతమైన పురోగతిని డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రముఖంగా ప్రస్తావించారు. దేశ బయోఎకానమీ 2014లో దాదాపు 10 బిలియన్ డాలర్లుగా ఉండేదని... అది ప్రస్తుతం సుమారు 95 బిలియన్ డాలర్లకు విస్తరించిందని ఆయన తెలిపారు. 2030 నాటికి దేశ బయోఎకానమీ దాదాపు 300 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనాలు సూచిస్తున్నాయన్నారు. దేశ ఆవిష్కరణల వ్యవస్థలో వస్తున్న పరివర్తనను ప్రతిబింబిస్తూ, భారత్ ఇప్పుడు 11,000కు పైగా బయోటెక్నాలజీ అంకురసంస్థలకు నిలయంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

ఆర్థిక వ్యవస్థ, ఉపాధి, పర్యావరణం కోసం బయోటెక్నాలజీ కేంద్రితమైన ప్రత్యేక బయోటెక్నాలజీ విధానాన్ని కలిగి ఉన్న అతికొద్ది దేశాల్లో భారత్ ఒకటిగా ఆవిర్భవించిందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఇది శాస్త్రీయ పరిశోధనను వేగంగా ఆర్థిక, సామాజిక ఫలితాలుగా మార్చడానికి వీలు కల్పిస్తుందని ఆయన అన్నారు. ప్రపంచ పరిణామాలను అనుసరించడం నుంచి బయోటెక్నాలజీలోని సరికొత్త రంగాల్లో చురుకైన భాగస్వామిగా మారే దిశగా దేశం పురోగతి సాధించిందని ఆయన పేర్కొన్నారు.

ఆరోగ్య సంరక్షణ బయోటెక్నాలజీలో భారత్ సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ, కోవిడ్-19కి వ్యతిరేకంగా ప్రపంచంలోనే తొలి డీఎన్ఏ వ్యాక్సిన్‌ను భారత్ అభివృద్ధి చేసిందని డాక్టర్ జితేంద్ర సింగ్ గుర్తుచేశారు. దాదాపు 30 దేశాలకు వ్యాక్సిన్‌లను సరఫరా చేయడం... పెరుగుతున్న భారత శాస్త్రీయ సామర్థ్యాలను, ప్రపంచ నాయకత్వాన్ని ప్రదర్శిస్తోందని ఆయన స్పష్టం చేశారు. సీఏఆర్-టీ సెల్ థెరపీ, అభివృద్ధి చెందుతున్న జన్యు-ఆధారిత చికిత్సల్లో దేశీయ పురోగతి కారణంగా అధునాతన చికిత్సలు అత్యంత సరసమైనవిగా మారుతున్నాయని ఆయన పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో కూడిన ప్రపంచ ఆరోగ్య సంరక్షణ గమ్యస్థానంగా భారత్ స్థానాన్ని ఇవి బలోపేతం చేస్తున్నాయని కేంద్ర మంత్రి తెలిపారు.

బయోటెక్నాలజీ భవిష్యత్తు ప్రధానంగా సింథటిక్ బయాలజీ, ఏఐ-ఆధారిత జీవ పరిశోధన, బయో-మాన్యుఫ్యాక్చరింగ్ ద్వారా ముందుకు సాగుతుందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. కొత్త ప్రొటీన్లను రూపొందించడం, జీవకణ-ఆధారిత ఔషధాలు, పరిశుద్ధ ఇంధనాలు, సుస్థిర ఆహార వ్యవస్థలను అభివృద్ధి చేయగల సాంకేతికతలు రాబోయే దశాబ్దాల్లో ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, పరిశ్రమల వంటి రంగాలను గణనీయంగా మెరుగుపరుస్తాయని ఆయన అన్నారు.

పరిశ్రమలతో బలమైన భాగస్వామ్యాల కోసం పిలుపునిస్తూ, భారత బయోటెక్నాలజీ రంగంలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని మరింతగా పెంచడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. స్వదేశీ డీఎన్ఏ వ్యాక్సిన్ వంటి విజయవంతమైన కార్యక్రమాలు, సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి తొలి దశల నుంచే పరిశ్రమల సహకారం ప్రాముఖ్యతను ప్రదర్శించాయని ఆయన పేర్కొన్నారు. ఆవిష్కరణలను వేగవంతం చేయడం లక్ష్యంగా భాగస్వాములు సాంప్రదాయిక ఆలోచనా విధానాలను అధిగమించి... శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు, తయారీదారుల మధ్య బలమైన భాగస్వామ్యాలను నిర్మించాలని ఆయన కోరారు.

స్వదేశీ జీవ-ఉత్పాదక సామర్థ్యాలను పెంపొందించడం... ప్రతిభ అభివృద్ధిని బలోపేతం చేయడం... విజ్ఞానం, ఆరోగ్యం, పరిశ్రమల రంగాల మధ్య సహకారాన్ని ప్రోత్సహించాల్సిన ప్రాముఖ్యతనూ కేంద్ర మంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. ఇంజనీరింగ్ బయాలజీ వంటి అభివృద్ధి చెందుతున్న విభాగాలు... ఆరోగ్య సంరక్షణ, ఆహార భద్రత, పర్యావరణ సుస్థిరత, అధునాతన తయారీ రంగాల్లో భారత ఆకాంక్షలకు మద్దతునివ్వగలిగే, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న శ్రామిక శక్తిని సృష్టిస్తాయని ఆయన తెలిపారు.

బయోటెక్నాలజీ విభాగం కార్యదర్శి డాక్టర్ రాజేష్ ఎస్. గోఖలే మాట్లాడుతూ, భారత్ నేడు ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న బయోఎకానమీల్లో ఒకటిగా ఉందన్నారు. ఇది 15?18 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేస్తోందని తెలిపారు. 'బయోఈ3' పాలసీ సహా ప్రగతిశీల విధానపరమైన కార్యక్రమాల మద్దతుతో దేశం దాదాపు 100 బయో-ఇంక్యుబేటర్లను, 10,000కు పైగా బయోటెక్నాలజీ కంపెనీలను అభివృద్ధి చేసిందని ఆయన పేర్కొన్నారు. నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని, ప్రపంచంతో పోటీపడగల బయోటెక్నాలజీ వ్యవస్థను నిర్మిస్తూనే... ఆవిష్కరణల ఆధారిత బయోమాన్యుఫ్యాక్చరింగ్, కచ్చితమైన ఆరోగ్య సంరక్షణ, సుస్థిర వ్యవసాయం, ఏఐ-సామర్థ్యం గల జీవశాస్త్రాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఈ రోడ్‌మ్యాప్ ఒక వ్యూహాత్మక ప్రణాళికను అందిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

నీతి ఆయోగ్ సభ్యులు ప్రొఫెసర్ గోబర్ధన్ దాస్ మాట్లాడుతూ, గత పారిశ్రామిక విప్లవాలతో పోల్చదగిన ఒక కీలకమైన బయోటెక్నాలజీ ఘట్టాన్ని భారత్ ప్రస్తుతం చూస్తోందని అన్నారు. గత దశాబ్ద కాలంలో దేశ బయోఎకానమీ దాదాపు 16 రెట్లు వృద్ధి చెంది, జాతీయ జీడీపీకి 4.8 శాతం వాటాను అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. కొత్తగా ప్రారంభించిన రోడ్‌మ్యాప్‌ను ప్రస్తావిస్తూ... ప్రతిపాదిత రూ. 50,000 కోట్ల బయోఎకానమీ గ్రోత్ ఫండ్, బలమైన ప్రతిభావంతుల లభ్యత, ప్రపంచ స్థాయి బయో-మాన్యుఫ్యాక్చరింగ్ సామర్థ్యాల మద్దతుతో 2035 నాటికి భారత బయోఎకానమీని దాదాపు 700 బిలియన్ డాలర్లకు పెంచాలని ఇది లక్ష్యంగా నిర్దేశించుకుందని కేంద్ర మంత్రి తెలిపారు. దేశాన్ని ప్రపంచంలోని అగ్రశ్రేణి బయోటెక్నాలజీ శక్తుల్లో ఒకటిగా మార్చడానికి పరిశ్రమ, పరిశోధకులు, పెట్టుబడిదారులు కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

రాబోయే దశాబ్దం ప్రపంచ బయో ఎకానమీలో భారత్ స్థానాన్ని నిర్ణయిస్తుందని పేర్కొంటూ డాక్టర్ జితేంద్ర సింగ్ తన ప్రసంగాన్ని ముగించారు. పరిశోధన, ప్రతిభ అభివృద్ధి, పారిశ్రామిక భాగస్వామ్యాలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల్లో నిరంతర పెట్టుబడులు... భారత ఆరోగ్య, ఆహార భద్రత రంగాలను బలోపేతం చేస్తాయన్నారు. తద్వారా లక్షలాది ఉన్నత నైపుణ్యం గల ఉద్యోగాలను సృష్టించడం సహా, ప్రపంచంతో పోటీపడగల బయోటెక్నాలజీ శక్తిగానూ భారత్ ఆవిర్భవిస్తుందని కేంద్ర మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

# మంత్రి వాకిటి శ్రీహరి ఆరోగ్యం కోసం ఆలయాల్లో ప్రత్యేక పూజలు



మహబూబ్‌నగర్, జులై 18: నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్యే రాష్ట్ర పశుసంవర్థక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని కోరుతూ శనివారం నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. మంత్రి వాకిటి శ్రీహరి వైరల్ ఫీవర్ తో బాధపడుతూ కూడా అధికారిక కార్యక్రమంలో,పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ వచ్చారు .దీంతో రెండు రోజుల క్రితం తీవ్ర అశ్వస్థకు గురి కావడంతో కుటుంబ సభ్యులు మంత్రిని హైదరాబాదులోని కేర్ ఆస్పత్రిలో చేర్పించారు .ప్రస్తుతం మంత్రి వైద్యుల పర్యవేక్షణలో ఐసీయూలో చికిత్స పొందుతున్నారు .నిరంతరం ప్రజల కోసం పనిచేస్తూ ప్రజల్లో ఉంటున్న మంత్రి ఒక్కసారిగా అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరడంతో ఆందోళనకు గురైన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మంత్రి త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ నియోజకవర్గంలోని మక్తల్, మాగనూర్, కృష్ణ ,ఆత్మకూరు,నర్వ మండలాల్లో ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు.

మక్తల్ పట్టణంలోని శ్రీ పడమటి అంజనేయ స్వామి దేవాలయం తో పాటు శ్రీ వేణుగోపాల స్వామి కదేవాలయంలోనూ మండల పరిధిలోని మందన్ గోడ్ సీపనగుండ్ల శ్రీ దత్తాత్రేయ స్వామి దేవాలయం లోనూ మంత్రి పేరిట ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు,పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్పర్సన్ వాటికి మానస హన్మంతు, మున్సిపల్ కౌన్సిలర్లు కోళ్ల సంధ్యా వెంకటేష్, మార్కెట్ వైస్ చైర్మన్ బి. గణేష్ కుమార్ ,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయ రవికుమార్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు రాజేందర్ గౌడ్ ,నాయకుల అమరేందర్ రెడ్డి, నీల గౌడ్ ,కుర్మయ్య గౌడ్ ,పసుల రంజిత్ రెడ్డి ,వాకిటి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పెద్దమ్మ ఆలయ పునర్నిర్మాణానికి రూ.1,01,016 విరాళం



మెదక్, జులై 18: మండల కేంద్రంలోని శ్రీ వనదుర్గ పెద్దమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణానికి సదాశివనగర్ గ్రామానికి చెందిన పోలాబోయిన స్వప్న-బాలగంగారం దంపతులు గురువారం రూ.1,01,016 విరాళాన్ని అందజేశారు. ఆలయంలో ప్రతిష్ఠించనున్న శ్రీ కృష్ణార్జున రథం నిర్మాణానికి ఈ విరాళాన్ని వినియోగించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ఆలయ అభివృద్ధి కోసం భక్తులు స్వచ్ఛందంగా విరాళాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు పోలాబోయిన పెంటవ్వ, పోలాబోయిన అనితరాములు, ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు ఎప్పుడు..

హైదరాబాద్, జులై 18:ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని దిశా కమిటీ మెంబర్ బీజేపీ నాయకులు వడ్ల నందు డిమాండ్ చేశారు. వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ముందు టపాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు ఆయన మద్దతు ప్రకటించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన పిఆర్సిని వెంటనే అమలు చేయాలని ఇచ్చిన హామీలను వెంటనే అమలు పరచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు తపాస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఎటువంటి కార్యక్రమాలు కైనా బిజెపి తరఫున పూర్తి మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు రాబోయే రోజుల్లో ప్రభుత్వం నుండి రావాల్సిన బకాయిలను వసూలు చేసుకోవాల్సిందిగా డిఏలు చెల్లించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మాటలకు పరిమితమైందని చేతల్లో ఏమీ లేదని ఆయన అన్నారు.

# సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర కమిషన్‌కు వినతిపత్రం

## -కార్మిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామని కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హామీ



ఖమ్మం, జులై 18: రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా పెద్దపల్లి జిల్లాకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు రేణిగుంట్ల ప్రవీణ్ కుమార్, కొంకటి లక్ష్మీనారాయణ, రాంబాబు నాయక్‌లను ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ (రిజిస్ట్రేషన్ నెం.1630/1982) ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి సింగరేణి సంస్థలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగారపు లింగమూర్తి మాట్లాడుతూ.. సింగరేణిలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై కమిషన్ ప్రత్యక్షంగా పర్యటించి యాజమాన్యంతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ప్రతిష్ఠకు అనుమతులు మంజూరు చేయాలని, సింగరేణి విద్యాసంస్థల్లో బోధన, బోధనేతర సిబ్బంది నియామకాల్లో రిజర్వేషన్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అంతర్గత వివక్షను అరికట్టేందుకు చర్యలు తీసుకోవా లని విజ్ఞప్తి చేశారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కూడా కమిషన్ పర్యటించాలని కోరారు. వినతిపై స్పందించిన కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. సింగరేణి కార్పొరేట్ కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుపై గతంలోనే యాజమాన్యానికి సూచనలు చేశామని తెలిపారు. త్వరలో సింగరేణి యాజమాన్యంతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీలపై వివక్ష లేదా అన్యాయం జరిగితే వెంటనే కమిషన్ దృష్టికి తీసుకురావాలని, కమిషన్ ఆదేశాలను అమలు చేయని యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సింగరేణి కార్మికులకు కమిషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కేంద్ర కమిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆరెపల్లి రామచందర్, కొత్తగూడెం రీజనల్ సెక్రటరీ మధు కృష్ణ, కార్పొరేట్ ఏరియా ఇన్‌చార్జి వెంకటేష్, నాయకులు బాలునాయక్, మోహన్ చందు నాయక్‌తో పాటు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేసిన చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు



కరీంనగర్, జులై 18:వారంతా చిన్ననాటి స్నేహితులు- ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రుల కలను సహకారం చేయాలనే లక్ష్యంతో విద్యనభ్యసించి కొందరు ఉద్యోగరీత్యా స్థిరపడగా. మరికొందరు వ్యాపారవేత్తలుగా రాణిస్తున్నారు. నేటితరం గ్రామీణ విద్యార్థులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వేములవాడకు చెందిన జవహర్ లాల్ నెహ్రూ పాఠశాల పదవ తరగతి 97-98 ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు.

చందుర్తి మండలం మల్యాల జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల ట్రిపుల్ ఐటీ కి ఎంపికైన పులి కీర్తన, ఎల్లా చరణ్ లకు ప్రతినెల ఒక్కొక్కరికి రూ. 3వేలు చొప్పున ఆరు సంవత్సరాల పాటు ఉపకార వేతనాలు అందజేస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా మొదటి మూడు నెలలకు సంబంధించిన రూ. 9వేల చెక్కులను అధ్యాపకుల సమక్షంలో విద్యార్థులకు అందజేశారు.

విద్యార్థులను ప్రోత్సహించేందుకు ముందుకు వచ్చిన 98 ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు హింగే శివం, సుమన్ శర్మ, వెంగలి రవి, జనగామ తిరుపతి లను ప్రధానోపాధ్యాయులు శరత్ చంద్ర అభినందించారు.

# ఆమరణ దీక్షలో కాక్రోచ్ పార్టీ ఫౌండర్ అభిజీత్ దీప్కే




న్యూ ఢిల్లీ, జులై 18:కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఇవాళ ఆమరణ దీక్షకు పూనుకున్నారు. ఇవాళ ఉదయం ఢిల్లీ పోలీసులు సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను ధర్నా క్షేత్రం నుంచి ఆస్పత్రికి తరలించారు. అయితే ఆ తరలింపు ప్రక్రియ ముగిసిన తర్వాత.. వాంగ్‌చుక్ నిరాహార దీక్షకు కూర్చున్న ప్రదేశంలో అభిజీత్ దీప్కే ఆందోళనకు దిగారు. అయితే జూలై 20వ తేదీన జరగాల్సిన తమ ర్యాలీ యధావిధిగా జరుగుతుందని అన్నారు. జంతర్ మంతర్ నిరసన ప్రదేశానికి ప్రజలు రావాలని ఆయన వేడుకున్నారు. ప్రభుత్వం తీవ్రమైన తప్పు చేసిందని, ప్రతి ఒక్కరూ జంతర్ మంతర్ చేరుకోవాలని తెలిపారు. సీపీఐ ఎంఎల్‌కు చెందిన నేహా, అమీన్, మనీశ్ జంతర్ మంతర్ వద్ద 21వ రోజు కూడా దీక్ష చేపట్టనున్నట్లు ఏఐఎన్ఏ ప్రెసిడెంట్ ఎన్ సాయి బాలాజీ తెలిపారు.

# టీ హబ్‌లో పురుడు పోసుకున్న కంపెనీ స్కైరూట్ : కేటీఆర్

హైదరాబాద్, జులై 18:టీ హబ్ వేదికగా ఏర్పడ్డ స్కైరూట్ సంస్థ శ్రీహరికోటలో చేపట్టిన విక్రమ్-1 రాకెట్ ప్రయోగ విజయవంతం కావడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో హైదరాబాద్ సరూర్ నగర్‌లో తలపెట్టిన యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ మాట్లాడుతూ.. టీ హబ్‌లో పురుడు పోసుకున్న కంపెనీ పేరు స్కైరూట్. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏండ్లు అయింది. ఇవాళ భారత దేశ చరిత్రలో ఒక ప్రైవేట్ రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపిన ఆ కంపెనీ మన టీహబ్ నుంచే వచ్చిందన్నారు.

ఇవాళ ఉదయమే ప్రయోగం విజయవంతంగా నిర్వహించారు. ఈ రోజు శ్రీహరికోట నుంచి ప్రైవేట్ రాకెట్‌ను పంపిన స్కైరూట్ కంపెనీకి చప్పట్లతో అభినందనలు తెలుపాలని కేటీఆర్ విద్యార్థులు, నిరుద్యోగ యువతకు పిలుపునిచ్చారు. ఇస్రో నుండి తొలిసారి ప్రైవేట్ రాకెట్ ప్రయోగం సక్సెస్ అవడంతో స్కైరూట్ కంట్రోల్ సెంటర్‌లో సంబురాలు చేసుకుంటున్నారు

# 'విద్యార్థులు సాంకేతిక విద్యను సద్వినియోగం చేసుకోవాలి'

## - ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు

ఖమ్మం, జులై 18: విద్యార్థులకు నాణ్యమైన, ఆధునిక విద్యను అందించాలనే లక్ష్యంతో ఆక్సల్ ప్రోగ్రాం ద్వారా ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలకు అందించిన కంప్యూటర్లను మధిర ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అత్యధిక విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో బనిగండ్లపాడు బీసీ కాలనీ పాఠశాల ఒకటిగా నిలవడం గర్వకారణమన్నారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం చూపుతున్న చొరవ ప్రశంసనీయమని కొనియాడారు.

నేటి పోటీ ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి విద్యార్థికి అత్యంత అవసరమని పేర్కొంటూ, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని సాంకేతిక విద్యలో నైపుణ్యం సాధించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలకు అందించిన కంప్యూటర్ల ద్వారా విద్యార్థుల్లో డిజిటల్ విద్యపై ఆసక్తి పెరిగి, భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశాలు మరింత విస్తరిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొగ్గుల శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ నాగరాజు, అక్కిరెడ్డి, పిచ్చిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వెంకటరామిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు జంగా గురునాథరెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# భారత తొలి 'హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్' రైలు సిద్ధం

న్యూఢిల్లీ, జులై 18: భారత తొలి 'హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్' రైలు అత్యాధునిక సాంకేతిక హంగులతో పట్టాలపై పరుగు తీసేందుకు సిద్ధమవుతోంది. అత్యంత పరిశుభ్ర, పర్యావరణ హిత ఇంధనమైన హైడ్రోజన్ ద్వారా తనకు అవసరమైన విద్యుత్తును ఇది స్వయంగా ఉత్పత్తి చేసుకుంటుంది. తద్వారా రైలు దూసుకెళ్లే సమయంలోనూ ఉద్గారాల విడుదల నామమాత్రంగానే ఉంటుంది. బొగ్గు, ఆవిరి నుంచి పరిశుభ్ర, మరింత సుస్థిర ఇంధన వనరుల దిశగా భారతీయ రైల్వేల పరిణామ క్రమంలో విస్తృత ప్రస్థానాన్ని ప్రతిబింబించే ఈ మలుపు తాజా అధ్యాయానికి నాంది పలుకుతోంది.

దేశవ్యాప్తంగా గడచిన 12 ఏళ్ల నుంచీ రైల్వేల విద్యుదీకరణ వేగం పుంజుకుంది. దీంతో డీజిల్ దిగుమతి పరాధీనత గణనీయంగా తగ్గి, కాలుష్య రహిత రైలు రవాణాలో తదుపరి దశకు మార్గం సుగమమైంది. ఈ మేరకు 99 శాతానికి పైగా బ్రాడ్ గేజ్ మార్గాల విద్యుదీకరణతో రైల్వేల ప్రస్థానం మరో అడుగు ముందుకేసింది. అయితే, తాజా పరిణామంతో ఇప్పుడిక ఎగువనున్న లైన్ల నుంచి విద్యుత్తును గ్రహించే సంప్రదాయక విద్యుత్ రైళ్ల నుంచి రైల్వేల భవిష్యత్తు మరో కొత్త మలుపు తీసుకుంటుంది. ఆ మేరకు హైడ్రోజన్-ఆక్సిజన్ మధ్య రసాయన చర్య ద్వారా 'హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్' రైలు తనకుతానే విద్యుత్తును ఉత్పత్తి చేసుకుంటుంది. ఈ రసాయన చర్య ఫలితంగా వెలువడే ఏకైక ఉప-ఉత్పత్తి కేవలం నీటి ఆవిరి మాత్రమే కావడం గమనార్హం.

దేశంలో ఒకప్పుడు ఆవిరి, డీజిల్‌తో నడిచే రైళ్లు ప్రయాణికులతోపాటు తమ ఇంధన వనరును కూడా మోసుకెళ్లేవి. అయితే, ఈ ఆధునిక రైలు తద్భిన్నంగా సొంత హైడ్రోజన్ వనరుతో వాతావరణంలోని ఆక్సిజన్‌ను గ్రహించి, తన ఇంధనాన్ని తానే ఉత్పత్తి చేసుకుంటుంది. దీనివల్ల దహన ప్రక్రియ తప్పడమే కాకుండా వెలుపలి నుంచి విద్యుత్ సరఫరాపై ఆధారపడే అవసరం ఉండదు. పరిశుభ్ర హైడ్రోజన్ సాంకేతికతతో విద్యుదుత్పాదన సాగుతుంది కాబట్టి, ఈ రైలు అత్యంత పర్యావరణ హితంగా మారుతుంది. తద్వారా సుస్థిర రైలు రవాణా భవిష్యత్తును శక్తిమంతం చేస్తుంది. ఈ అధునాతన చోదక వ్యవస్థకు తోడు హైడ్రోజన్ లీకేజీ, ఉష్ణోగ్రత, మంటలు, పొగ తదితరాలను గుర్తించగల బహుళ అంచెల భద్రత వ్యవస్థలను ఈ రైలులో అమర్చారు. దీన్ని 89 కిలోమీటర్ల పొడవైన జింద్-సోనిపత్ మార్గంలో గంటకు 75 కిలోమీటర్ల ఆచరణాత్మక వేగంతోపాటు 110 కిలోమీటర్ల మూల వేగంతో ప్రయోగాత్మకంగా నడపడం ద్వారా రైలు భద్రతను, వేగాన్ని ధ్రువీకరించారు.

# సీ మైన్స్‌ను ఢీకొట్టి పేలిన రెండు చమురు ట్యాంకర్‌లు.. ప్రకటించిన ఐఆర్‌జీసీ

న్యూఢిల్లీ, జులై 18:పశ్చిమాసియా లో ఉద్రిక్తతలు అంతకంతకే పెరుగుతున్నాయి. ఇంధన రవాణాకు కీలకమైన హార్మూజ్ జలసంధి లో అంతరాయాలు కొనసాగుతూనే ఉన్నాయి. తమ హెచ్చరికలు పట్టించుకోని నౌకలపై ఇప్పటికే అమెరికా-ఇరాన్ పోటీపడి దాడులు చేస్తున్నాయి. మరోవైపు యుద్ధం ప్రారంభంలో ఇరాన్ అమర్చిన మందుపాతరలు మరో ముప్పుగా పరిణమించాయి. ఈ తెల్లవారుజమున రెండు చమురు ట్యాంకర్లు సముద్రంలో ఇరాన్ అమర్చిన సీ మైన్స్‌ను ఢీకొట్టి పేలిపోయాయి. ఈ విషయాన్ని ఐఆర్‌జీసీ వెల్లడించింది. 'కొద్దిసేపటి క్రితం హార్మూజలో మందుపాతరలు ఉన్న ప్రాంతం మీదుగా వెళ్లిన రెండు చమురు ట్యాంకర్లు పేలిపోయాయి' అని ఐఆర్‌జీసీ ప్రకటించింది. అదేవిధంగా ఈ జలమార్గం మీదుగా వెళ్లేందుకు ప్రయత్నించిన మరో నాలుగు నౌకలను కూడా తాము అడ్డుకున్నామని తెలిపింది. మరోవైపు ఏడోరోజు కూడా ఇరాన్‌పై దాడులు కొనసాగాయి. దాంతో దక్షిణ ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. మరో రెండు, మూడు రోజులు ఇలాగే దాడులు కొనసాగితే తాము పూర్తిస్థాయి ఘర్షణకు దిగుతామని ఇరాన్ హెచ్చరించింది. 'మేము దీటుగా స్పందిస్తాం. ఏ సరిహద్దు కూడా సురక్షితంగా ఉండదు' అని పేర్కొన్నది. అన్నట్టే యూఎస్ స్థావరాలు లక్ష్యంగా చేస్తున్న ప్రతీకార దాడులను ఇరాన్ కొనసాగిస్తున్నది. తాజాగా కువైట్, జోర్డాన్‌పైకి క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది

# భారత కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే నేతృత్వంలో సాగిన బ్రిక్స్ మంత్రుల పర్యటన

న్యూఢిల్లీ, జులై 18:బ్రిక్స్ దేశాల కార్మిక, ఉపాధి శాఖ మంత్రులు, ప్రతినిధి బృందాల నేతలు ఈ రోజు హైదరాబాద్‌లోని బోష్ గ్లోబల్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ క్యాంపస్‌ను, సీఐఐ గ్రీన్ బిజినెస్ సెంటర్ (సీఐఐ-జీబీసీ)నూ సందర్శించారు. కేంద్ర ఎంఎస్ఎంఈ, కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి సుశ్రీ శోభా కరంద్లాజే నేతృత్వంలో ఈ పర్యటన సాగింది. భారత బ్రిక్స్ అధ్యక్షతన హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న 12వ బ్రిక్స్ కార్మిక, ఉపాధి శాఖ మంత్రుల సమావేశం (ఎల్ఈఎంఎం)లో భాగంగా ఈ పర్యటన జరిగింది. డిజిటల్ ఆవిష్కరణ, కృత్రిమ మేధ (ఏఐ), గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్స్ (జీసీసీ), భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే నైపుణ్యాభివృద్ధి, సుస్థిర పారిశ్రామిక వృద్ధి వంటి రంగాల్లో పెరుగుతున్న భారత్ నాయకత్వాన్ని ఈ సందర్శనలు ప్రముఖంగా స్పష్టం చేశాయి.

బోష్ గ్లోబల్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ సందర్శనలో భాగంగా బ్రిక్స్ ప్రతినిధి బృందం బోష్, సీఐఐ (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ), ఆరోగ్య సంరక్షణ, ఆటోమోటివ్, తయారీ వంటి రంగాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్స్ (జీసీసీలు) నుంచి వచ్చిన సీనియర్ పరిశ్రమ నాయకులతో సంభాషించింది. ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధి, ప్రొడక్ట్ ఇంజనీరింగ్, ఏఐ-ఆధారిత పరిష్కారాలు, ప్రపంచ వ్యాపార పరివర్తనను జీసీసీలు ముందుకు నడిపిస్తున్న తీరును ఈ చర్చలు ప్రదర్శించాయి. పరిశ్రమ-విద్యాసంస్థల సహకారాన్ని బలోపేతం చేయడం... మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించడం... కార్యాలయాల పనితీరును మెరుగుపర్చడానికి ఏఐని ఉపయోగించుకోవడం... సమ్మిళిత, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న శ్రామిక శక్తిని నిర్మించడంపై చర్చల్లో ప్రధానంగా దృష్టి సారించారు.

2.36 మిలియన్లకు పైగా నిపుణులకు ఉపాధి కల్పిస్తున్న 2,100కు పైగా గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లతో వేగంగా విస్తరిస్తున్న భారత జీసీసీ వ్యవస్థ గురించి పరిశ్రమ ప్రముఖులు బ్రిక్స్ ప్రతినిధి బృందానికి వివరించారు. దాదాపు 400 జీసీసీలకు నిలయమైన హైదరాబాద్, దేశంలోని ప్రముఖ ఆవిష్కరణల కేంద్రాల్లో ఒకటిగా ఆవిర్భవించింది. టెక్నాలజీ, ఇంజనీరింగ్, డిజిటల్ పరివర్తనకు ప్రపంచ స్థాయిలో ప్రాధాన్య గమ్యస్థానంగా భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేసింది.

సీఐఐ గ్రీన్ బిజినెస్ సెంటర్‌లో... హరిత భవనాలు, వనరుల సామర్థ్యం, పర్యావరణ-సామాజిక-పరిపాలన (ఈఎస్‌జీ) పద్ధతులు, సుస్థిర పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించడానికి భారత్ చేస్తున్న ప్రయత్నాలను మంత్రులకు వివరించారు. పోటీతత్వం, సామర్థ్యాలు, నాణ్యమైన ఉపాధిని పెంపొందిస్తూనే... పర్యావరణపరంగా బాధ్యతాయుతమైన వ్యాపార పద్ధతులను అవలంబించడానికి వీలు కల్పించేలా భారత పరిశ్రమకు ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మార్గదర్శనం చేస్తోంది.

పర్యావరణ సుస్థిరత, హరిత భవిష్యత్తు పట్ల బ్రిక్స్ దేశాల సమష్టి నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ... బ్రిక్స్ మంత్రులు, ప్రతినిధి బృందాల అధిపతులు సీఐఐ గ్రీన్ బిజినెస్ సెంటర్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

చైతన్యవంతమైన భారత ఆవిష్కరణల వ్యవస్థను, అత్యంత నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని, సుస్థిర అభివృద్ధి పట్ల బలమైన నిబద్ధతను ప్రత్యక్షంగా చూసేందుకు బ్రిక్స్ ప్రతినిధి బృందాలకు ఈ పర్యటన ఒక చక్కని అవకాశాన్ని కల్పించింది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలో... భవిష్యత్ పనితీరును తీర్చిదిద్దడం, సమ్మిళితమైన, సమర్థమైన, సుస్థిర ఆర్థిక వృద్ధిని పెంపొందించడం కోసం సాంకేతికత, ఆవిష్కరణలు, నైపుణ్యాలు, సుస్థిరతను వినియోగించుకోవాలనే దార్శనికతతో ముందుకు సాగుతున్న భారత పురోగతిని ఇది స్పష్టం చేసింది.

# మెస్సి, రొనాల్డోలపై ప్రశంసలు.. ఇంగ్లండ్‌పై విమర్శలు చేసిన ట్రంప్

న్యూఢిల్లీ, జులై 18: అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి, పోర్చుగల్ ప్లేయర్ క్రిస్టియానో రొనాల్డోలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసలు కురిపించారు. వారిలో ఏదో ప్రత్యేకమైన ప్రతిభ సహజంగానే ఉంటుందని అన్నారు. అదే సమయంలో ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ కేన్‌ను సరిగ్గా వినియోగించుకోలేకపోయారని ఇంగ్లండ్ కోచ్ థామస్ టుచెల్‌పై ట్రంప్ విమర్శలు గుప్పించారు. ఆదివారం జరగనున్న అర్జెంటీనా-స్పెయిన్ వరల్డ్ కప్ ఫైనల్‌కు ముందు న్యూయార్క్‌లోని ట్రంప్ టవర్‌లో నిర్వహించిన ఫిఫా కార్యక్రమంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫిఫా అధ్యక్షుడు జియానీ ఇన్ఫాంటినోతో పాటు పలువురు ఫుట్‌బాల్ ప్రముఖులు పాల్గొన్నారు.

ఇంగ్లండ్‌తో జరిగిన సెమీఫైనల్లో అర్జెంటీనా 2-1తో విజయం సాధించడంలో మెస్సి కీలక పాత్ర పోషించాడు. మ్యాచ్ చివరి నిమిషాల్లో మెస్సి అందించిన అద్భుతమైన పాస్‌తో లౌటారో మార్టినెజ్ గోల్ చేసి అర్జెంటీనాను ఫైనల్‌కు చేర్చాడు. ఆ క్షణాన్ని గుర్తుచేసుకున్న ట్రంప్.. మెస్సి ప్రత్యర్థుల కళ్లుగప్పి సరైన స్థానానికి చేరుకోవడం, కచ్చితమైన పాస్ ఇవ్వడం తనను ఆకట్టుకున్నాయని తెలిపారు. 'మెస్సిని గమనించాను. అతడిపై గట్టి నిఘా ఉంది. కానీ ఒక్కసారిగా అతను కుడి వైపునకు వెళ్లిపోయాడు. ఎవరూ దానిపై మాట్లాడలేదు.. నేను మాత్రం గమనించాను. మెస్సి ఇచ్చిన ఆ పాస్ అద్భుతమైనది. ఒక్క అంగుళంలో పావు వంతు తేడా కూడా లేకుండా కచ్చితంగా వెళ్లింది. అదే మ్యాచ్ ఫలితాన్ని మార్చింది. మెస్సి, క్రిస్టియానో రొనాల్డో వంటి ఆటగాళ్లు కీలక సమయాల్లో అద్భుతాలు చేయగలరు. ఇలాంటి గొప్ప ఆటగాళ్లు పదే పదే అలాంటి క్షణాలను సృష్టిస్తారు. వాళ్లు ఏదో అదనపు ప్రతిభతో పుడతారు. రొనాల్డో కూడా అలాంటి ఆటగాడే. అతడు కూడా గొప్ప వ్యక్తి' అని ట్రంప్ ప్రశంసించారు.

ఇంగ్లండ్ వ్యూహాలపై ట్రంప్ అసంతృప్తి

సెమీఫైనల్లో అర్జెంటీనాపై ఇంగ్లండ్ ఆధిక్యంలోకి వచ్చిన తర్వాత జట్టు వ్యూహంపై ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా స్టార్ స్ట్రైకర్ హ్యారీ కేన్‌ను డిఫెన్స్ బాధ్యతల్లోకి పంపడాన్ని తప్పుబట్టారు. 'ఇంగ్లండ్ వద్ద హ్యారీ కేన్ లాంటి గొప్ప ఆటగాడు ఉన్నాడు. అతను అద్భుతంగా ఆడి జట్టును విజయపథంలోకి తీసుకెళ్లగలడు. కానీ ఆధిక్యంలోకి వచ్చిన తర్వాత అతడినే డిఫెన్స్‌లో ఆడించడం తప్పిదం కావచ్చు. ఇంగ్లండ్ జట్టు మరింత దూకుడుగా ఆడాల్సింది. కోచ్ ఎలాంటి వ్యూహాలు చేశాడో అర్థం కాలేదు. తమ అత్యుత్తమ ఆటగాడిని డిఫెన్స్‌లోకి పంపడం పూర్తిగా అర్థం లేని విషయం అని నాకనిపించింది. సెమీ ఫైనల్ లాంటి కీలక పోరులో కొంత అటాక్ చేసే ఆలోచన కూడా ఉండాలి. నేనేమీ ఫుట్‌బాల్ కోచ్‌ను కాదు.. కానీ ఇది నా వ్యక్తిగత అభిప్రాయం' అని ట్రంప్ పేర్కొన్నారు.

సెమీ ఫైనల్ పోరులో హ్యారీ కేన్‌ను డిఫెన్స్ వైపు పంపడంపై ఇంగ్లండ్ కోచ్ థామస్ టుచెల్ వివరణ ఇచ్చారు. మొత్తం జట్టు రక్షణాత్మకంగా ఆడాల్సిన పరిస్థితి రావడంతోనే కేన్‌ను కూడా అటువైపు పంపాల్సి వచ్చిందని తెలిపారు. అయితే చివరి 30 నిమిషాల్లో తమ జట్టు ఎక్కువగా డిఫెన్స్‌కే పరిమితమైందని, బంతిపై పట్టు కోల్పోయామని అంగీకరించారు. ఇక ఇంగ్లండ్ మూడో స్థానం కోసం ఫ్రాన్స్‌తో తలపడనుండగా.. వరల్డ్ కప్ ట్రోఫీని నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో మెస్సి నేతృత్వంలోని అర్జెంటీనా ఫైనల్లో స్పెయిన్‌ను ఎదుర్కోనుంది.

# అంతరాష్ట్ర నేరగాళ్లు ఇద్దరు అరెస్ట్



ఖమ్మం, జులై 18: తక్కువ ధరకు బంగారం ఇస్తామని ప్రజలను నమ్మబలికి రూ.85.70 లక్షలు తీసుకుని పలువురిని మోసం చేసిన అంతరాష్ట్ర నేరగాళ్లను కామేపల్లి పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సింగరేణి సీఐ సునావత్ సాగర్ కేసు వివరాలను వెల్లడించారు. కామేపల్లి మండలం బాసీత్ నగర్‌కు చెందిన బానోత్ సాయికుమార్, కర్ణాటక రాష్ట్రానికి చెందిన నారాయణప్ప గురప్పను ప్రధాన నిందితులుగా గుర్తించినట్లు తెలిపారు. నిందితులు అమాయక ప్రజలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని, అతి తక్కువ ధరలకు భూములు, బంగారం ఇస్తామని నమ్మబలికి కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు విచారణలో తేలిందన్నారు. నిందితుల నుండి కారు, మొబైల్ ఫోన్, నకిలీ ఆధార్ కార్డు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రజలు ఇలాంటి మోసగాళ్లను నమ్మి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తుల సమాచారం స్థానిక పోలీసులకు తెలుపాలన్నారు. కేసును త్వరితగతిన ఛేదించిన స్థానిక ఎస్ఐ, సిబ్బందిని ఆయన అభినందించారు.

# వైభవ ధర్మపురిలో వైదిక సంక్షోభం... పుష్కరాల వేళ పుణ్యక్షేత్రానికి సిబ్బంది గ్రహణం!

పవిత్ర గోదావరి తీరాన వెలసి, వేల సంవత్సరాల ఆధ్యాత్మిక, సాంస్కృతిక, చారిత్రక వారసత్వాన్ని తనలో దాచుకున్న ధర్మపురి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి క్షేత్రం తెలంగాణకే కాదు, యావత్ దక్షిణ భారతదేశానికి ఒక ఆధ్యాత్మిక మణిహారం. నిత్యం వేలాది మంది భక్తులు తరలివచ్చే ఈ పుణ్యక్షేత్రం వైకుంఠ ఏకాదశి, నరసింహ జయంతి, బ్రహ్మోత్సవాలు, కార్తీక మాస ఉత్సవాల వేళ భక్తజన సందోహంతో కళకళలాడుతుంది. పన్నెండేళ్ల కొకసారి వచ్చే గోదావరి పుష్కరాల సమయంలో అయితే ధర్మపురి గోదావరి తీరానికి, శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయానికి దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఇంతటి అపారమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యత, భక్తుల విశ్వాసం, చారిత్రక నేపథ్యం కలిగిన ఈ పుణ్యక్షేత్రం ప్రస్తుతం సిబ్బంది కొరతతో సతమత మవుతుండటం అత్యంత ఆందోళనకరమైన విషయం.

స్వామివారి ఆలయానికి భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఆదాయం పెరుగుతోంది. ఉత్సవాల విస్తృతి పెరుగుతోంది. పుష్కరాల వంటి మహత్తరమైన వేడుకలు ముందున్నాయి. కానీ ఆ స్థాయిలో ఆలయ సిబ్బంది మాత్రం పెరగడం లేదు. ఫలితంగా పరిమిత సంఖ్యలో ఉన్న ఉద్యోగులపైనే పరిపాలన, లెక్కలు, దస్త్రాలు, భక్తుల సేవలు, ఉత్సవాల ఏర్పాట్లు, ఆదాయ వ్యయాల నిర్వహణ వంటి అనేక బాధ్యతలు పడుతున్నాయి. సిబ్బంది కొరతను కేవ లం ఉద్యోగుల సమస్యగా చూడలేం. అది చివరికి భక్తులకు అందే సేవల నాణ్యతను, ఆలయ పరిపా లనా సామర్థ్యాన్ని, దేవస్థాన ఆదాయ వినియోగాన్ని ప్రభావితం చేసే అంశం.

దశాబ్దాలుగా ధర్మపురి దేవస్థాన సూపరింటెండెంట్‌గా అనుభవంతో, సమర్థతతో విధులు నిర్వహించిన దేవళ్ళ కిరణ్‌కు పదోన్నతి లభించి నల్లగొండ శ్రీ లక్ష్మి నరసింహస్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారిగా బదిలీ అయ్యారు. ఒక సమర్థుడైన అధికారికి పదోన్నతి లభించడం అభినందనీయమే. అయితే ఆయన బదిలీతో ధర్మపురి క్షేత్రం ఒక అనుభవజ్ఞుడైన పరిపాలనా దక్షుడిని కోల్పోయింది. అనంతరం సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అంకితభావంతో పని చేస్తున్న అనుభవజ్ఞుడైన అలువాల శ్రీనివాస్‌కు పదోన్నతి కల్పించి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించారు. దీనివల్ల పైస్థాయి ఖాళీ భర్తీ అయినప్పటికీ, దిగువస్థాయిలో మరో ఉద్యోగ ఖాళీ ఏర్పడింది. అంటే ఒక పోస్టును భర్తీ చేసినా, మొత్తం సిబ్బంది కొరత మాత్రం తీరలేదు. ఇది దేవస్థానాల్లో నెలకొన్న నియామకాల సమస్యకు ఒక చిన్న ఉదాహరణ మాత్రమే.

ఇక ధర్మపురి దేవస్థానానికి చెందిన ఇద్దరు ఉద్యోగులు ప్రస్తుతం ఇతర ప్రాంతాల్లో ప్రతియుక్తిపై విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. స్థానికంగా భక్తుల రద్దీని తట్టుకోవాల్సిన, పండుగల ఏర్పాట్లను పర్యవేక్షించాల్సిన, రాబోయే పుష్కరాల కోసం సిద్ధం కావాల్సిన దేవస్థానానికి చెందిన సిబ్బంది ఇతర ప్రాంతాల్లో పనిచేయడం ఎంతవరకు సమంజసం అన్న ప్రశ్న తలెత్తుతోంది. అలాగే ఒకరిద్దరు త్వరలో విశ్రాంతులు కాబోతున్నారు.

ఒకవైపు ఇక్కడ ఉద్యోగుల కొరత, మరోవైపు ఇక్కడి ఉద్యోగులే ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహించడం పరిపాలనా ప్రణాళికలోని వైరుధ్యాన్ని స్పష్టం చేస్తోంది. స్థానిక అవసరాలు అత్యవసరంగా ఉన్నప్పుడు మాతృ దేవస్థానానికి చెందిన సిబ్బందిని అక్కడే వినియోగించుకోవడం సహజ న్యాయం.

ధర్మపురి సమస్య కేవలం పరిపాలనా సిబ్బంది కొరతతోనే ఆగిపోలేదు. క్షేత్ర ఆత్మగా భావించే వైదిక సంప్రదాయాలపైనా ఈ కొరత ప్రభావం చూపుతోంది. స్వామివారి నిత్య అభిషేక కైంకర్యాల సమయంలో స్మార్త ఆగమ సంప్రదాయానికి అనుగుణంగా నిత్య అభిషేక యుక్త పంచోపనిషత్తుల పఠనంతో కూడిన వేదోక్త పూజా విధానం ధర్మపురి క్షేత్ర ప్రత్యేకత. ఇది ఒక సాధారణ పూజా విధానం కాదు. తరతరాలుగా కొనసాగుతున్న వైదిక వారసత్వం. అయితే ఈ క్షేత్రంలో ఉన్న ఏకైక ఋగ్వేద పండితుడు కూడా ప్రస్తుతం ప్రతియుక్తిపై హైదరాబాద్‌లోని ఒక దేవాలయంలో విధులు నిర్వహిస్తున్న పరిస్థితి ఏర్పడింది. దీంతో నిత్య వేదపఠనం, మంత్రపుష్ప పఠనం, వేదోక్త కైంకర్యాల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వేదఘోషతో మారు మోగాల్సిన ప్రాచీన పుణ్యక్షేత్రంలో వేదపండితుల కొరత ఏర్పడటం సాధారణ పరిపాలనా లోపంగా చూడరాదు.

వైదిక సేవల విషయంలో వంశపారంపర్య నియామక విధానం కూడా ఒక సవాలుగా మారింది. నిర్దిష్ట కుటుంబానికి చెందిన వారే కొన్ని సేవలు నిర్వహించే సంప్రదాయం ఉన్నప్పుడు, ఆ కుటుంబంలో జననం లేదా మరణం సంభవించిన సందర్భాల్లో ఆచార ప్రకారం జననాశౌచం, మృతాశౌచం పాటించాల్సి ఉంటుంది. ఆ సమయంలో వారు ఆలయ సేవలకు హాజరుకాలేని పరిస్థితి ఏర్పడుతుంది. ప్రత్యామ్నాయంగా శాశ్వతంగా అందుబాటులో ఉండే వేదపండితులు లేకపోవడంతో,



స్థానికంగా ఉన్న ఇతర పండితులను అభ్యర్థించి తాత్కాలికంగా వేదపఠనం నిర్వహించాల్సి వస్తోంది. ఇది శాశ్వత పరిష్కారం కాదు. ధర్మపురి వంటి ప్రాచీన క్షేత్రంలో వైదిక సంప్రదాయాలు ఏ పరిస్థితుల్లోనూ నిలిచిపోకుండా ఉండాలంటే వివిధ కుటుంబాలకు చెందిన, ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం తదితర వేదాల్లో ప్రావీణ్యం కలిగిన కనీసం ఐదుగురు వేదపండితులను శాశ్వత ప్రాతిపదికన నియమించాలి.

రాబోయే గోదావరి పుష్కరాలు ఈ సమస్య తీవ్రతను మరింత స్పష్టంగా చూపించ నున్నాయి. పుష్కరాల సమయంలో ధర్మపురికి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు చేరుకుంటారు. పుష్కరాల నిర్వహణ అంటే కేవలం దర్శన క్యూలను నియంత్రించడం కాదు. ప్రసాదాల తయారీ, పంపిణీ, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వసతి, విద్యుత్, అగ్నిమాపక భద్రత, అత్యవసర వైద్య సేవలు, పోలీసు శాఖతో సమన్వయం, భక్తుల రాకపోకలు, విరాళాల నిర్వహణ, ఆదాయ వ్యయాల లెక్కలు వంటి వందలాది బాధ్యతలను ఏకకాలంలో నిర్వహించాల్సి ఉంటుంది. ఇలాంటి సమయంలో అరకొర సిబ్బందితో మహా పుష్కరాల నిర్వహణకు సిద్ధం కావడం ప్రమాదకరమైన పరిపాలనా నిర్లక్ష్యమే అవుతుంది.

ఇటీవలే దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో 191 మందికి వివిధ ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేయడం ఆశాజనకమైన పరిణామం. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్, డైరెక్టర్ హన్మంతరావు తదితర ఉన్నతాధికారుల సమక్షంలో జరిగిన ఈ నియామకాలు శాఖలోని ఖాళీల భర్తీకి ఒక ముందడుగు. నియామకాలు, పదోన్నతులు, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కమిషనర్ హన్మంతరావు ప్రత్యేక చొరవతో, ఉన్నతాధికారులు కృషి చేస్తున్నప్పటికీ, ధర్మపురి వంటి అత్యంత ప్రాధాన్యత కలిగిన దేవస్థానాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

మొదటి చర్యగా ధర్మపురి దేవస్థానానికి చెందిన ఉద్యోగులు ఇతర ప్రాంతాల్లో ప్రతియుక్తిపై ఉంటే వారి సేవలను మాతృ దేవస్థానానికి తిరిగి వినియోగించే అంశాన్ని తక్షణమే పరిశీలించాలి. పుష్కరాల దృష్ట్యా ఇతర తక్కువ రద్దీ ఉన్న దేవస్థానాల నుంచి అనుభవజ్ఞులైన సిబ్బందిని తాత్కాలికంగా ధర్మపురికి తీసుకురావాలి. గతంలో ధర్మపురి దేవస్థానంలో పనిచేసి పదవీ విరమణ చేసిన అనుభవజ్ఞులైన ఉద్యోగుల సేవలను అవసరమైతే పరిమిత కాలానికి ఒప్పంద ప్రాతిపదికన వినియోగించుకోవచ్చు. ఆలయ విధివిధానాలపై వారికి ఉన్న అనుభవం తక్షణ పరిపాలనకు ఎంతో ఉపయోగపడుతుంది.

వేదపండితుల కొరతను తాత్కాలిక ఏర్పాట్లతో కాకుండా శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలి. అర్హత కలిగిన యువ వేదపండితులను గౌరవప్రదమైన వేతనాలతో నియమించాలి. ధర్మపురిలో వేద పాఠశాలను పునరుద్ధరించి, యువతకు వేద పారాయణం, ఆగమ శాస్త్రాలు, ఆలయ సంప్రదాయాలపై శిక్షణ ఇవ్వాలి. విద్యా వేతనాలు, శిక్షణా సౌకర్యాలు కల్పించి భవిష్యత్తు అవసరాలకు తగిన వైదిక మానవ వనరులను తీర్చిదిద్దాలి. ఒక క్షేత్రం వైదిక సంప్రదాయం నిలవాలంటే అక్కడి భవిష్యత్తు తరాలను ఇప్పటి నుంచే సిద్ధం చేయాలి.

అదే సమయంలో పరిపాలనా విభాగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలి. దర్శన టికెట్లు, ఆర్జిత సేవల నమోదు, ప్రసాదాల ముందస్తు బుకింగ్, వసతి గృహాల కేటాయింపు వంటి సేవలను అంతర్జాల ఆధారిత విధానంలో అందుబాటులోకి తీసుకురావాలి. డిజిటల్ విరాళాల స్వీకరణ, నగదు రహిత చెల్లింపులు, పారదర్శక లెక్కల నిర్వహణ ద్వారా సిబ్బందిపై ఒత్తిడిని తగ్గించవచ్చు. ఆలయ ప్రాంగణంలో సమాచార కేంద్రాలు, స్వయంచాలక సమాచార పరికరాలు ఏర్పాటు చేస్తే భక్తులకు త్వరితగతిన సమాచారం అందుతుంది. అయితే సాంకేతికత పరిపాలనా భారాన్ని తగ్గించగలదే తప్ప, నిత్య పూజలు, గర్భగుడి సేవలు, వేదపఠనం వంటి పవిత్ర కార్యక్రమాలకు శిక్షణ పొందిన మానవ వనరులకు ప్రత్యామ్నాయం కాలేదు.

ధర్మపురి శ్రీ లక్ష్మి నరసింహస్వామి దేవస్థానం కేవలం ఒక ఆలయం కాదు. అది తెలంగాణ ఆధ్యాత్మిక వారసత్వానికి సజీవ ప్రతీక. గోదావరి తీరాన వెలసిన ఈ పుణ్యక్షేత్రం ఉత్తర తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు కూడా కీలకమైనది. భక్తుల రాకతో స్థానిక వ్యాపారాలు, హోటళ్లు, రవాణా, పర్యాటక రంగాలు అభివృద్ధి చెందుతాయి. అందువల్ల దేవస్థానానికి బలమైన పరిపాలనా వ్యవస్థ, సమృద్ధిగా సిబ్బంది, నిరంతర వైదిక సేవలు ఉండటం అత్యవసరం.

ఇకనైనా ప్రభుత్వం, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ధర్మపురి దేవస్థాన సిబ్బంది సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలి. మొత్తం సిబ్బంది బలంపై సమగ్ర సమీక్ష నిర్వహించాలి. ఖాళీ పోస్టులను గుర్తించి శాశ్వతంగా భర్తీ చేయాలి. పదోన్నతుల కారణంగా ఏర్పడిన దిగువస్థాయి ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి. ప్రతియుక్తిపై ఉన్న ఉద్యోగుల అవసరాన్ని పునఃసమీక్షించాలి. పుష్కరాల కోసం అదనపు సిబ్బందిని ముందుగానే నియమించాలి. వివిధ వేదాల్లో నిష్ణాతులైన పండితులను శాశ్వతంగా నియమించాలి. ధర్మపురి క్షేత్ర వైదిక సంప్రదాయాలను కాపాడేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి.

ధర్మపురి పుణ్యక్షేత్రంలో సిబ్బంది కొరత అనే గ్రహణం కొనసాగితే, దాని ప్రభావం కేవలం కార్యాలయ గదులకే పరిమితం కాదు. అది భక్తుల సేవలపై, ఆలయ పరిపాలనపై, వైదిక సంప్రదాయాలపై, రాబోయే పుష్కరాల నిర్వహణపై పడుతుంది. అందుకే ఇది తక్షణ పరిష్కారం కోరుతున్న సమస్య. వైభవానికి ప్రతీకగా నిలిచిన ధర్మపురిలో వేదఘోష నిరంతరం మారుమోగాలి. భక్తుల సేవలు నిరాటంకంగా సాగాలి. పుష్కరాల వేళ ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు జరగాలి. సిబ్బంది కొరత అనే గ్రహణం తొలగి, పరిపాలనా సామర్థ్యం, వైదిక వైభవం, భక్తి సంప్రదాయాలు సమన్వయంతో ముందుకు సాగినప్పుడే పవిత్ర గోదావరి తీరాన వెలసిన ధర్మపురి శ్రీ లక్ష్మి నరసింహస్వామి క్షేత్రం తన పూర్వ వైభవాన్ని మరింతగా సంతరించుకుని, భక్తుల విశ్వాసానికి నిలువెత్తు ప్రతీకగా, వైదిక సంప్రదాయాల సజీవ నిలయంగా శాశ్వతంగా వెలుగొందుతుంది.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# సెకండ్‌హ్యాండ్ మొబైల్ కొనుగోలు సమయంలో ఆధార్‌తో పాటు పూర్తి వివరాలు నమోదు చేయాలి

**మొబైల్ దొంగల సమాచారమిస్తే ప్రశంసాపత్రంతో సత్కారం-జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**



రాజన్న సిరిసిల్ల, జులై 18:(నేటినిజం ప్రతినిధి): మొబైల్ షాప్ యజమానులు సెకండ్‌హ్యాండ్ మొబైల్ ఫోన్లు కొనుగోలు లేదా ఎక్స్ఛేంజ్ చేసే సమయంలో విక్రయించే వ్యక్తి యొక్క ఆధార్ కార్డు తో పాటుగా పూర్తి వివరాలు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మొబైల్ షాప్స్ యజమానులకి సూచించారు. ఈసందర్భంగా శనివారం రోజున జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పరిధిలోని పలు మొబైల్ షాప్స్ మరియు రిపేర్ షాప్స్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూజిల్లాలో వివిధ సందర్భాల్లో దొంగలించబడిన లేదా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్స్ అమ్మడానికి లేదా ఎక్స్ఛేంజ్ చేయడానికి వచ్చిన వారి పట్ల అప్రమత్తంగా వ్యవహరిస్తు వారి యొక్క ఆధార్ కార్డ్ తో పాటుగా పూర్తి వివరాలు సేకరించాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా లేదా దొంగిలించిన మొబైల్ ఫోన్ల విక్రయానికి ప్రయత్నిస్తున్నట్లు అనుమానం వచ్చినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. మొబైల్ ఫోన్ దొంగలను పట్టించడంలో లేదా వారి ఆచూకీ పోలీసులకు అందించడంలో సహకరించిన మొబైల్ షాప్ యజమానులకు జిల్లా పోలీసుల తరఫున ప్రశంసాపత్రం అందజేయడం జరుగుతుందన్నారు. సెకండ్‌హ్యాండ్ మొబైల్ ఫోన్ కొనుగోలు చేసే సమయంలో సంబంధిత మొబైల్ షాప్ యజమాని నుంచి తప్పనిసరిగా బిల్లు లేదా రసీదు తీసుకోవాలని, తక్కువ ధరకు లభిస్తుందనే ఆశతో దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను తెలియక కొనుగోలు చేసి అమాయక ప్రజలు చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దొంగిలించబడిన మొబైల్ ఫోన్ అని తెలిసి కూడా కొనుగోలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. మొబైల్ ఫోన్ విక్రయించాలనుకునే వారు సంబంధిత కంపెనీల స్టోర్లలో ఎక్స్ఛేంజ్ లేదా చట్టబద్ధమైన విక్రయ కేంద్రాల ద్వారానే విక్రయించాలని, తెలియని వ్యక్తులకు లేదా అనధికారికంగా కొనుగోలు చేసే షాపులకు విక్రయించవద్దని సూచించారు. ఇటువంటి దొంగిలించబడిన మొబైల్ ఫోన్లు సైబర్ నేరాలకు వినియోగించే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ తెలిపారు. అందరి సహకారంతోనే మొబైల్ ఫోన్స్ రికావరిలో దక్షిణ భారతదేశంలో మొదటి స్థానం,రాష్టంలో వరుసగా మూడవ సంవత్సరం మొదట స్థానంలో నిలవడం జరిగిందని,అందరి సహకారంతోనే నేరాల నియత్రించవచ్చని తెలిపారు.ఎవరైన మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే CEIR పోర్టల్ ( https://www.ceir.gov.in ) నందు బ్లాక్ చేసి, సంభందిత పోలీసు స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని సూచించారు.ఎస్పీ వెంట ఐటి కోర్ ఎస్.ఐ కిరణ్ కుమార్, కానిస్టేబుల్ రాజాతిరుమలేష్, మొబైల్ షాప్స్ యజమానులు పాల్గొన్నారు.

## విద్యార్థినిలతో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయులు.. విధుల నుంచి తొలగింపు..

కామారెడ్డి, 18:(నేటినిజం ప్రతినిధి): బాన్సువాడ మండలం కొత్తబాది మోడల్ స్కూల్‌లో విద్యార్థినులపై వేధింపులు కలకలం రేపాయి. పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు కాంట్రాక్టు ఉపాధ్యాయులు తమతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని పలువురు బాలికలు ఆరోపించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. విద్యార్థినిల ఫిర్యాదును తీవ్రంగా పరిగణించిన విద్యాశాఖ అధికారులు వెంటనే పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. బాలికలు, పాఠశాల సిబ్బంది నుంచి వివరాలు సేకరించి నివేదిక రూపొందించారు.

ప్రాథమిక విచారణలో ఆరోపణలకు తగిన ఆధారాలు ఉన్నట్లు గుర్తించిన అధికారులు తదుపరి చర్యలకు ఉపక్రమించారు. ఈ మేరకు కాంట్రాక్టు ఉపాధ్యాయులు గోపాల్, పవన్‌ను విధుల నుంచి తొలగించారు. విషయం విద్యార్థుల తల్లిదండ్రుల దృష్టికి వెళ్లడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యాసంస్థల్లో తమ పిల్లల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణ కొనసాగుతోందని, దర్యాప్తులో మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

## మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడలో దారుణం.. చెరువులో శవమై కనిపించిన యువతి

మేడ్చల్, జులై 18:పీర్జాదిగూడలో ఓ యువతి మృతదేహం చెరువులో లభ్యమవడం కలకలం రేపింది. శంకర్‌నగర్ సమీపంలోని చెరువులో యువతి శవాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

మృతురాలు ఎవరు.. ఆమె ఎలా మృతి చెందింది.. ప్రమాదవశాత్తూ చెరువులో పడిందా.. లేదా మరేదైనా కారణం ఉందా.. అనే అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు.

## నగరంలో జోరు వాన

ములుగు, జులై 17: (నేటినిజం ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో శుక్రవా రం వర్షం దంచికొట్టింది. ములుగు, వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతంలో గంట పాటు జోరుగా కరువగా, ములుగు జిల్లా ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, కన్నాయిగూ డెంలో భారీ వర్షం పడింది. నగరంలోని పలు కూడళ్లు, ప్రధాన రహదారులు వరదనీటితో నిండిపోయాయి.

అనేక కాలనీల్లో వరద నీరు చేరింది. హనుమకొండలోని సర్క్యూట్ గెస్ట్ హౌస్ రోడ్డు, బస్‌స్టేషన్, తిరుమల జంక్షన్, హంటర్‌రోడ్డు వరద నీటితో నిండిపోయాయి. వరంగల్ ప్రాంతంలోని అండర్ బ్రిడ్జి, చిన్న బ్రిడ్జి కింద పెద్ద ఎత్తున వరద నీరు నిలిచింది. హంటర్‌రోడ్డులోని సీఎస్ఆర్ గార్డెన్ జంక్షన్, సంతోషిమాత టెంపుల్ ప్రాంతాల్లో వరద నీరు చేరాయి.

రాకపోకలకు ఇబ్బందులు పడ్డ జనం

నగరంలోని అనేక రహదారులపైకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వరంగల్‌లోని అండర్‌బ్రిడ్జి, చిన్న బ్రిడ్జి కిందకు పెద్ద ఎత్తున వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అండర్ రైల్వేగేట్ ప్రాంతానికి వెళ్లే ప్రజలు ?ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా వెళ్లారు.

## కుల్లా క్రమంలో భద్రకాళీ

**మూడో రోజు వైభవంగా శాకంబరీ ఉత్సవాలు**

ములుగు, జులై 17: (నేటినిజం ప్రతినిధి): నగరంలోని ప్రసిద్ధ భద్రకాళీ ఆలయంలో శాకంబరీ నవరాత్రుల మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు శుక్రవారం ఉదయం కుల్లా క్రమంలో, సాయంత్రం నిత్యక్లిన్నా అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

ప్రధాన అర్చకులు భద్రకాళీ శేషు ఆధ్వర్యంలో సుప్రభాత సేవతో ప్రారంభమై నిత్యాహ్నికం, క్షీరాన్న నివేదన నిరాజనం, మంత్ర పుష్పాలతో ముగిసింది. అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఈవో రామల సునీత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## అధికారులు, ప్రజాప్రతినిదులు సమన్వయంతో పని చేయాలి





కామారెడ్డి, 18:(నేటినిజం ప్రతినిధి): ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు, ప్రజాప్రతినిదులు సమన్వయంతో పనిచేసే జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షట్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో శుక్రవారం దిశా సమావేశం నిర్వహించారు

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. వ్యవసాయం, నీటిపారుదల. రహదారులు, రహదారి భద్రత, బ్యాంకింగ్, విద్య, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

సమావేశంలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర, మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి, అదనపు కలెక్టర్ విక్టర్, అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ గిరి, డీఆర్డీఏ దామోదర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షణ చేయాలి

**-అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్**



రాజన్న సిరిసిల్ల, జులై 18:(నేటినిజం ప్రతినిధి): జిల్లావ్యాప్తంగా నిర్మాణ పురోగతిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను వేగవంతంగా పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయడం, రెండో దశలో ఇండ్ల మంజూరుపై గృహనిర్మాణ శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, అన్ని మండలాలకు కేటాయించిన లక్ష్యం, ఇప్పటివరకు పూర్తయిన నిర్మాణాలు, వివిధ దశల్లో ప్రగతిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. ఇండ్లు లేని పేదల కలలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం పారదర్శకంగా అమలు చేస్తుందని తెలిపారు. గుడిసెలు, రేకుల షెడ్లలో నివసిస్తున్న వారికి పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని ఆదేశించారు. నిర్మాణాలు వేగవంతం చేసేలా క్షేత్ర స్థాయిలో అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా నిర్మాణాల్లో జాప్యం జరిగితే వాటి కారణాలు తెలుసుకుని, సమస్యలు పరిష్కరించి, నిర్మాణాలు శరవేగంగా పూర్తి చేసేలా చూడాలని సూచించారు. ప్రగతిలో ఉన్న ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసి గృహప్రవేశాలు చేసేందుకు ముందుకు వెళ్లాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓ లు, ఏఈ లు క్షేత్ర స్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించి, లబ్ధిదారుల ఇబ్బందులు దూరం చేయాలని ఆదేశించారు. రోజు వారీగా ఇండ్లను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని సూచించారు. రెండో దశ నిర్మాణాల మంజూరుపై ఆరా తీసిన కలెక్టర్, నిర్మాణానికి ఆసక్తి ఉన్న అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేయాలని ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్ లో హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి జయశీల తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డులకు ఈ-కేవైసీ తప్పనిసరి..

**-నిజామాబాద్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి**

కామారెడ్డి, 18:(నేటినిజం ప్రతినిధి): రేషన్ కార్డు లబ్ధిదారులకు పౌరసరఫరాల శాఖ మరోసారి కీలక సూచనలు జారి చేసింది. ఈ కేవైసీ విషయంలో లబ్ధిదారులందరూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నది. ఇప్పటివరకు ఈ-కేవైసీ చేసుకొని లబ్ధిదారులు తమ రేషన్ కార్డులు వెంటబెట్టుకొని వెంటనే సంబంధిత డీలర్లను కలవాలని సూచించింది.

ఉచితంగా ఈ-కేవైసీ చేసుకునేందుకు జూలై 31 వరకు గడువు ఉందని నిజామాబాద్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి వెల్లడించారు. ఈ-కేవైసీ చేసుకొని లబ్ధిదారులకు భవిష్యత్‌లో సరుకు సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతాయని అధికారులు సూచిస్తున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులందరూ వెంటనే తమ రేషన్ కార్డులను ఈ-కేవైసీ చేసుకోవాలని తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.